


అనంతలో దగ్గుబాటి..


రాయదుర్గంలో కాలవ..


ఉరవకొండలో కేశవ్..



జన తరంగం


ర్యాలీలో పాల్గొన్న కేశవ్, ఆయన తనయులు

అర్బన్‌లో టీడీపీ కూటమి అభ్యర్థి దగ్గుబాటి నామినేషన్
వేలాది మందితో నగరంలో ర్యాలీ
హాజరైన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, శ్రేణులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 24: టీడీపీ అనంత అర్బన్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ బుధవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. శ్రీనగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయం నుంచి వేలాది మందిలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేసి, మత పెద్దలు దగ్గుబాటిని ఆశీర్వదించారు. కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీ నుంచి జడ్పీ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం దాకా ర్యాలీలో జనం కిక్కిరిసిపోయారు. బాణ సంచా కాలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ, డప్పులు వాయిదాల మధ్య ర్యాలీ కొనసాగింది. జై చంద్రబాబు.. జై దగ్గుబాటి ప్రసాద్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తెలుగు తల్లి విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యువజన అధ్యక్షుడు జస్వంత్ వ్యాస్, జనసేన నగర ప్రధాన కార్యదర్శి ఇమామ్ హుస్సేన్, బీసీ నాయకులు గజమాలతో దగ్గుబాటి ప్రసాద్‌ను సన్మానించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన తర్వాత ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్‌కు కూటమి పార్టీల నాయకుల సమక్షంలో ఆయన తన నామినేషన్‌ను అందజేశారు.

నా విజయం ఖాయం..

తన నామినేషన్ మహోత్సవానికి అనూహ్యరీతిలో వేలాది జనం తరలిరావడం సంతోషకరమని దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. ఈ స్పందన చూసిన తర్వాత ఎన్నికల్లో తన విజయం ఖాయమని తేలిపోయిందని అన్నారు. మెజార్టీ ఎంత వస్తుందని ఆలోచిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ తనను వారి సొంత మనిషిలా భావించి నడిపిస్తున్నారని అన్నారు. చంద్రబాబునాయుడే తనకు ఆదర్శమని, ఒక్క అవకాశం ఇస్తే చంద్రబాబు సహకారంతో అనంతను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ జేఎల్ మురళీధర్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, ప్రకాష్ నాయుడు, గాజుల ఆదెన్న, గౌస్‌మొహిద్దీన్, సాలార్ బాషా, కొండవీటి సుధాకర్‌నాయుడు, రాయల్ మురళి, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, కుంచెపు వెంకటేష్, సుధాకర్ యాదవ్, జయరాంరెడ్డి, స్వామిదాస్, నారాయణస్వామి యాదవ్, సైపుద్దీన్, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎం లక్ష్మీప్రసాద్, మారుతీకుమార్ గౌడ్, రాజారావు, నెట్టెం బాలకృష్ణ, కూచి హరి, కురబ నారాయణస్వామి, గుర్రం నాగభూషణం, కడియాల కొండన్న, గుత్తా ధనుంజయనాయుడు, దగ్గుబాటి శ్రీలక్ష్మీ, కొండవీటి భావన, స్వప్న, విజయశ్రీరెడ్డి, సంగా తేజస్విని, బల్లా పల్లవి, సరళ, లక్ష్మీనాయుడమ్మ, వడ్డే భవాని తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న దగ్గుబాటి







టీడీపీ కార్యకర్తల హంగామా..




రాయదుర్గంలో పాల్గొన్న జనాలు

ఉరవకొండ జనసంద్రం
టీడీపీ కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్ నామినేషన్.. ర్యాలీకి ఇసుకేస్తే రాలనంత జనం

ఉరవకొండ, ఏప్రిల్ 24: టీడీపీ కూటమి అభ్యర్థిగా ఉరవకొండలో పయ్యావుల కేశవ్ బుధవారం నామినేషన్ వేశారు. తమ స్వగ్రామం కౌకుంట్ల నుంచి కార్యకర్తలతో కలిసి బుధవారం చిన్నముష్టూరు గ్రామ సమీపంలోని కల్లంబండ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అక్కడి నుంచి ఉరవకొండకు చేరుకుని నామినేషన్ వేశారు. అనంతరం ఓపెన్‌టాప్ వాహనంపై ఎక్కి ప్రజలకు అభివాదం చేసుకుంటూ, కవితా సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో 30 వేల మందికి పైగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు. ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. గుంతకల్లు-ఉరవకొండ ప్రధాన రహదారి కిక్కిరిసింది. రోడ్లన్నీ పసుపుమయంగా మారాయి.

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొడదాం..

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పయ్యావుల కేశవ్ అన్నారు. తనపై 30 ఏళ్లుగా ఆదరాభిమానాలు చూపుతున్న ప్రజలకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నామినేషన్‌కు తరలివచ్చిన ప్రజలను చూస్తుంటే ఎన్నికల ఫలితాలు ఉరవకొండలో ముందే వచ్చాయనిపిస్తోందిన అన్నారు. రాజకీయంగా ఈ స్థాయికి ఎదగడానికి కారణం ప్రజల ఆశీర్వాదమేనని అన్నారు. ఉరవకొండలో అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ హయాంలోనే అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విశ్వేశ్వరరెడ్డి ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని సవాలు విసిరారు. అసమర్థుడైన వ్యక్తికి ఓటేస్తే తినే అన్నంలో మట్టి వేసుకున్నట్లేనని అన్నారు. రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. 1994 ఎన్నికల ఫలితాలు 2024లో పునరావృతం కావడం ఖాయమని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కాలువలకు నీళ్లు ఇచ్చేందుకు తాను లష్కర్‌గా పనిచేసేందుకు సిద్ధంగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయులు విక్రమ్‌సింహా, విజయ్‌సింహా, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకులు డి.పురుషోత్తం, ప్రతాప్‌నాయుడు, మండల కన్వీనర్ విజయభాస్కర్, బీడీ మారయ్య, నూతేటి వెంకటేష్, టీడీపీ నాయకులు రామాంజినేయులు, తిమ్మప్ప, కూటమి నాయకులు కొనకొండ్ల రాజేష్, గౌతమ్, లక్ష్మినారాయణ, పాల్గొన్నారు.


ఎగిరే పతాకం..


నామినేషన్ దాఖలు చేస్తున్న పయ్యావుల కేశవ్

కిక్కిరిసిన దుర్గం
వేలాది మందితో కాలవ రోడ్ షో
టీడీపీ కూటమి అభ్యర్థిగా నామినేషన్


రోడ్‌షోలో కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 24: టీడీపీ కూటమి అభ్యర్థిగా రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వేలాది మందితో రోడ్‌షో నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు. అంతకు మునుపు కాలవ శ్రీనివాసులు శాంతినగర్‌లోని బన్ని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఉదయం 11.45 గంటలకు ప్రారంభమైన రోడ్‌షో మధ్యాహ్నం 2.45 వరకు కొనసాగింది. శాంతినగర్, బళ్లారిరోడ్, వినాయకసర్కిల్, బస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు సాగింది. వినాయక సర్కిల్, లక్ష్మీబజార్‌లో ఆయనను గజమాలలతో సత్కరించారు. ముస్లిం మైనార్టీలు సంప్రదాయంగా టోపీ, శాలువతో సన్మానించారు. కార్యకర్తలకు అభివాదం చేస్తూ, విజయ సంకేతం చూపుతూ కాలవ ముందుకు కదిలారు. అనంతరం నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలు వసుంధర, మంజునాథ, కాలవ తనయుడు కాలవ భరత్ వాహనంపై కాలవతో కలిసి ప్రయాణించారు. కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, రాయదుర్గం మండలాలల నుంచి వేలాది మంది వాహనాలలో తరలిరావడంతో రాయదుర్గం రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. సీఐలు శ్రీనివాసులు, ప్రసాద్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాయదుర్గం అభివృద్ధికి కష్టపడతా..

రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా రాయదుర్గాన్ని తీర్చిదిద్దే వరకూ కష్టపడుతునే ఉంటానని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. రోడ్‌షోను చూస్తే ప్రజాభిమానం తనపై ఏ స్థాయిలో ఉందో అర్థమైపోయిందని అన్నారు. మండే ఎండను లెక్కచేయకుండా, ఉరికే ఉత్సాహంతో రోడ్డు పొడవునా కేరింతలు కొడుతూ తనను విజయీభవ అని దీవిస్తున్న కూటమి శ్రేణులకు కృతజ్ఞతలు అన్నారు. నామినేషన్ సందర్భంగా ప్రజలకు హామీలు ఇస్తున్నారని స్పష్టం చేశారు. నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందేవరకు విశ్రమించకుండా శ్రమిస్తానని అన్నారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తీసుకువస్తానని అన్నారు. ఐదేళ్లలో ఉంతకల్లు రిజర్వాయర్ పనులు ప్రారంభించి, పదేళ్లలో పూర్తి చేయిస్తానని అన్నారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులను చేపడతామని అన్నారు. ఎడారీకరణను, వలసలను నివారించి, పూర్వవైభవం తీసుకొస్తామని అన్నారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడానికి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కఠోరంగా శ్రమిస్తానని అన్నారు. వెనుకబడిన తరగతుల వారికి హాస్టల్‌ను ఏర్పాటు చేయిస్తామని, బాలికల జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉర్దూ బాలికల కళాశాలను తీసుకొస్తామని అన్నారు. కణేకల్లుకు డిగ్రీ కళాశాల తీసుకొస్తామన్నారు. చెరువును బాగు చేయిస్తామన్నారు. గార్మెంట్స్ పరిశ్రమను బతికించడానికి చేపట్టిన టెక్స్‌టైల్స్ పార్క్‌లో 50 యూనిట్లు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. నేమకల్లు, బొమ్మనహాళ్ మధ్యలో ఇనుప ఖనిజం ప్రత్యేక సెజ్ ఏర్పాటు చేయిస్తామని అన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తామన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న కాలవ శ్రీనివాసులు

నేడు ఏపీఆర్ఎస్ ప్రవేశ పరీక్షలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 24: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్, కళాశాలల్లో ప్రవేశాలకు జిల్లాలో గురువారం ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏసీ గోవింద్‌నాయక్ తెలిపారు. కేఎస్ఆర్ హైస్కూల్‌లో పరీక్షల కన్వీనర్, సీఎస్, డీఓలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఏపీఆర్ఎస్ పరీక్షలు 23 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ జరుగుతాయని, 5,798 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఏపీఆర్‌జేసీ అండ్ డీసీ పరీక్షలు 31 కేంద్రాల్లో నిర్వహిస్తామని, 7,330 మంది హాజరవుతారని తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉంటాయన్నారు. విద్యార్థులు ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో మాత్రమే 15 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతిస్తామని తెలిపారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్/గుతి, ఏప్రిల్ 24: టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా గొంది వెంకటశివుడు యాదవ్ నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తికి చెందిన వెంకటశివుడు యాదవ్ 1999లో టీడీపీలో చేరారు. 2016 నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2014లో ఆయన గుంతకల్లు ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించినా, పార్టీ అధిష్టానం ఇవ్వలేకపోయింది. ఈ ఎన్నికల్లోనూ అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితుల్లో ఆయనను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ, ప్రాధాన్యం కల్పించారు. పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.


వెంకటశివుడు యాదవ్

ఉల్లంఘనులపై వేటు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 24: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ కొరఢా ఝులిపించారు. ఒకే రోజు తొమ్మిది మందిపై చర్యలు తీసుకున్నారు. కాంట్రాక్ట్ పబ్లిక్ హెల్త్ వర్కర్ పెద్దక్క, వలంటీర్లు పెన్నోబళేసు, రాజు, బాబాఫరీద్, రవిబాబు, జ్యోతి, భాగ్య, రషీద్, ఉరవకొండ మండలం ఆమిద్యాలకు చెందిన ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌ను విధుల నుంచి తొలగించారు.

ఈరోజే లాస్ట్..!
నామినేషన్లకు ముగియనున్న గడువు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 24: నామినేషన్లకు ఒక్క రోజు మాత్రమే గడువు ఉండగా.. జిల్లా వ్యాప్తంగా బుధవారం భారీ స్థాయిలో నామినేషన్లు పడ్డాయి. ఎంపీ స్థానానికి నాలుగు, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 57 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంపీ స్థానానికి వైసీపీ తరఫున మాలగుండ్ల శంకరనారాయణ, కాంగ్రెస్ తరఫున మల్లికార్జున, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి పార్టీ తరఫున నల్లాని రమేష్‌నాయుడు, స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్ వేశారు. నామినేషన్లు వేసేందుకు గురువారం ఆఖరి రోజు. చివరి రోజున కూడా భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తోంది.

- ఉరవకొండలో టీడీపీ తరఫున కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు, వైసీపీ తరఫున విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదనరెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ తరఫున బెస్తపవన్, జైభారత్ నేషనల్ పార్టీ తరఫున రామాంజినేయులు, స్వతంత్రులు బాలరామాంజినేయులు, చంద్రశేఖరరెడ్డి నామినేషన్ వేశారు.
- రాయదుర్గంలో టీడీపీ తరఫున కాలవ శ్రీనివాసులు, కాలవ విజయలక్ష్మి, వైసీపీ తరఫున మెట్టుగోవిందరెడ్డి, మెట్టు విశ్వనాథరెడ్డి, స్వతంత్రులు రంగనాథ్, కురుబ శ్రీనివాసులు, పగడాల గోవిందరాజులు, గోవిందు, బెళ్లారి గోవింద నామినేషన్ వేశారు.
- రాప్తాడులో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, స్వతంత్రులు వెంకటరాముడు, సంతోష్ కుమార్‌రావు, వైనల్లప్ప, ఆబిదాల గోవిందు, కె. కేశవరెడ్డి నామినేషన్ వేశారు.
- కళ్యాణదుర్గంలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, కాంగ్రెస్ అభ్యర్థి రాంభూపాల్‌రెడ్డి, జైభీంరావ్ భారత్ పార్టీ తరఫున వెంకటేశులు, స్వతంత్రులు బలిజ శ్రీనివాసులు, తగ్గుపర్తి రామన్న నామినేషన్ వేశారు.
- అనంతపురం అర్బన్‌లో టీడీపీ తరఫున దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఇద్దరు స్వతంత్రులు నామినేషన్ వేశారు.
- శింగనమలలో వైసీపీ తరఫున వీరాంజనేయులు, కాంగ్రెస్ తరఫున డాక్టర్ శైలజానాథ్, స్వతంత్రులు రవిరాజు, ఓబిళేసు నామినేషన్ వేశారు.
- గుంతకల్లులో వైసీపీ తరఫున వై.వెంకటరామిరెడ్డి, ఎల్లారెడ్డి శారద, ఎస్పీ తరఫున జంగం క్రిష్ణ, స్వతంత్రులు రామాంజినేయులు, రహిమ, పి.శశిభూషణరెడ్డి, ప్రభాకర్, తోక భారతి, అరుణమ్మ నామినేషన్ వేశారు.
- తాడిపత్రిలో వైసీపీ తరఫున పెద్దారెడ్డి, టీడీపీ తరఫున అశ్మిత్ రెడ్డి, స్వతంత్రులు ఒకరు, జైబీంరావు పార్టీ తరఫున ఒకరు నామినేషన్ వేశారు.

సంకల్పం ఫెయిల్

- స్టడీ మెటీరియల్ ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం
- పది ఫలితాల్లో జడ్పీ, ప్రభుత్వ స్కూళ్లు బోల్తా
- అత్యల్ప ఫలితాలకు బాధ్యత ఎవరిది?

అనంతపురం విద్య, ఏప్రిల్ 24: అధికారులు నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం అనంత సంకల్పం మెటీరియల్ ఇవ్వకపోవడంతో ప్రభుత్వ, జిల్లా పరిషత్ స్కూళ్లలో దారుణమైన ఫలితాలు వచ్చాయి. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఇతర యాజమాన్య స్కూళ్ల కంటే అత్యల్ప ఫలితాలు జడ్పీ, ప్రభుత్వ స్కూళ్లలో వచ్చాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు డీసీఈబీ ద్వారా మెటీరియల్ తయారు చేయించే ఇస్తుంది. అయితే గతంలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో రెడీ చేసి ఇచ్చేవారు. కానీ ఈ ఏడాది తీవ్ర నిర్లక్ష్యం చూపి సగానికిపైగా రోజులు గడిచాక ఇచ్చారు.



ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

కింద నుంచి ఒకటి, రెండు స్థానాలు

ఇతర యాజమాన్య స్కూళ్లలో పోలిస్తే ఈ ఏడాది గవర్నమెంట్ స్కూళ్లు, జిల్లాపరిషత్ స్కూళ్ల ఫలితాలు చాలా అధ్వానంగా ఉన్నాయి. టెన్త్ ఫలితాల్లో గవర్నమెంట్ స్కూళ్లు, జడ్పీ స్కూళ్లు కింద నుంచి ఒకటి, రెండో స్థానాల్లో నిలిచాయి. గవర్నమెంట్ స్కూళ్లలో బాయ్స్ 1051 మందికి గాను 651 మంది పాసయ్యారు. బాలికలు884 మందికిగాను 629 మంది పాసయ్యారు. మొత్తంగా 1935 మందికిగా 1280 మంది పాసయ్యారు. 66.15 శాతం ఉత్తీర్ణత వచ్చింది. జడ్పీ స్కూళ్ల బాలురు 6,108 మంది రాస్తే... 3,715 మంది, బాలికలు 5345 మంది రాస్తే...4085 మంది పాసయ్యారు. టోటల్‌గా 11453 మంది పరీక్షలు రాస్తే 7800 మంది పాసయ్యారు. 68.10 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఇతర యాజమాన్య స్కూళ్లలో 70 శాతంపై నుంచి 80 శాతం, 90 శాతం పైనే వచ్చాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి దారుణమైన ఫలితాలు వచ్చాయనే విమర్శలు వినవస్తున్నాయి.

వారి నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

ప్రతి ఏటా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నడిచే డీసీఈబీ ద్వారా గవర్నమెంట్, జడ్పీ విద్యార్థులకు అనంత సంకల్పం పేరుతో స్టడీ మెటీరియల్ అందిస్తారు. నిపుణులైన ఉపాధ్యాయులతో మెటీరియల్ తయారు చేయిస్తారు. విద్యార్థుల నుంచి వచ్చిన ఫీజుల ద్వారా...ఆ మెటీరియల్‌ను బయట ముద్రణాలయాల్లో రూపొందిస్తారు. అయితే ఈ విద్యా ఏడాది ఈ ప్రక్రియపై అప్పటి డీఈఓ, డీసీఈబీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చూపారు. ఫలితంగా సకాలంలో మెటీరియల్ ఇవ్వడంలో ఫెయిల్ అయ్యారు. పరీక్షలకు కేవలం 49రోజుల ముందు అప్పటి కలెక్టర్‌తో ఆవిష్కరణ చేయించి, ఇద్దామా వద్దా అన్నట్లుగా పిల్లలకు పంపిణీ చేశారు. అంతేకాకుండా మెటీరియల్ ప్రిపరేషన్‌పై హెచ్ఎంలతో ఎలాంటి పర్యవేక్షణ చేయించలేదు. ఈ కారణాలన్నింటి వల్ల కూడా ఫలితాలు దారుణంగా వచ్చాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కలెక్టర్ల ఆలోచనలను నీరుగారుస్తున్నారా...?

మునుపటి జిల్లా కలెక్టర్ల ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిన ఈ అనంత సంకల్పాన్ని కొందరు అధికారులు నీరుగారుస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వారి నిర్లక్ష్యం ఇప్పుడు వేలాది విద్యార్థులకు శాపంగా మారింది. గవర్నమెంట్ స్కూళ్లలో బాలురు 400 మంది, బాలికలు 255 మంది ఫెయిల్ అయ్యారు. జడ్పీ స్కూళ్లలో బాలురు 2393 మంది, బాలికలు 1260 మంది టెన్త్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. రెండు యాజమాన్య స్కూళ్లలో ఏకంగా 4308 మంది ఫెయిల్ అయ్యారు. అధికారులు ముందుగా శ్రద్ధ పెట్టి ఉంటే...వీళ్లలో సగం మంది కానీ, అందరూ కానీ పాసయ్యే అవకాశాలు ఉండేవేమో. అయితే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే ఇక్కడ నష్టపోయింది మాత్రం పేద విద్యార్థులే. విద్యార్థుల భవిష్యత్తుకు జరిగిన నష్టాన్ని ఇప్పుడు ఏ అధికారి పూడుస్తారో చూడాలి.

కూలీల ప్రచారం



సార్వత్రిక ఎన్నికలు కొందరి పొట్ట నింపుతున్నాయి. మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చాలా ప్రాంతాల్లో పనులు నిలిచిపోయాయి. దీంతో రెక్క ఆడితే గాని డొక్కాడని కూలీలకు జీవనోపాధి కష్టంగా మారింది. చాల మంది పనులు లేక ఇళ్ల వద్దే ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారానికి వస్తే భోజనంతో పాటు, కూలి డబ్బులు ఇస్తామని ప్రధాన పార్టీలు వారికి ఆఫర్ ఇచ్చాయి. ఇంకేముంది పార్టీ ఏదైతేనేమి కూలి ముఖ్యమన్నట్లుగా కూలీలంతా ఎన్నికల ప్రచారంలోకి దూకారు. జెండాలు చేతపట్టి, కనబడ్డవారికి కరపత్రాలు ఇస్తూ కూలి ఇస్తున్న అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థి నామినేషన్ పర్వంలో కోలాహలమంతా వీరిదే. ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు మహిళలకైతే రూ200, పురుషులకైతే రూ.500 ఇస్తున్నట్లు కూలీలు బహిరంగంగానే చెబుతున్నారు.

- మడకశిర రూరల్

అభివృద్ధికే నా ఓటు

టి.హసీనా, సిండికేట్ నగర్, అనంతపురం రూరల్ మండలం



నేను తొలిసారి ఓటు వేయబోతున్నా. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే వారికే ఓటు వేస్తా. ప్రస్తుతం ఐటీ అంటే హైదరాబాదు, బెంగళూరు గుర్తుకొస్తాయి. ఆ విధంగా రాష్ట్రంలోను ఐటీని అభివృద్ధి చేయాలి. సైన్స్ పరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం చాలా ఉంది. భవిష్యత్తుకు ఉపయోగపడే పరిశోధనలు చేసేందుకు ఆస్కారం కల్పించాలి. ముందు చూపుగల నాయకులను ఎన్నుకోవాలి.

- అనంతపురం రూరల్

నలుగురైదుగురు చర్చించుకునేవాళ్లం



నంబులపూలకుంట: ఇంకా రెండు, మూడు దినాల్లో ఎన్నికలు జరుగుతాయనగా ఊర్లో ఉండేవారు వాళ్లకు అనుకూలమైన నలుగురైదుగురితో ఎవరికి ఓటు వేయాలనే విషయమై మాట్లాడుకునేవారు. ఎవరికి ఓటేస్తే గ్రామానికి మంచి చేస్తాడనే విషయమై చర్చ సాగేది. మా చుట్టుపక్కల గ్రామాలైన బందారుచెట్లపల్లి, ఎగువపల్లి, వంకమద్ది, పోరెడ్డివారిపల్లి గ్రామాలనుంచి కూడా కొంత మంది ఒక చోట చేరి, ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకుని వేసేవారం. అప్పట్లో కంకి, కొడవలి గుర్తు పార్టీ ఉండేది. చేయి గుర్తు ఉన్న పార్టీ కూడా ఉండేది. మేమంతా స్వచ్ఛందంగానే ఓటు వేసేవాళ్లం. అప్పుడు రాజకీయాలు నీతిగా, న్యాయంగా ఉండేవి. ప్రస్తుతం అభ్యర్థి తరపున నాయకులే రవాణా సౌకర్యం, భోజన వసతి కల్పిస్తున్నారంటే రాజకీయాలు, ఎన్నికలు ఎలా మారాయో మీరే ఊహించుకోండి.

- వెంకటయ్య, పోరెడ్డివారిపల్లి

అప్పట్లో నిజాయితీగా ఓటు వేసే వాళ్లు



మడకశిర: ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు, అంకితభావం లేకుండా పోయాయి. అప్పట్లో ఎన్నికల ప్రచారం ఇంత ఆర్భాటంగా ఉండేది కాదు. సిద్దనగౌడ్ శాసనసభ్యుడు అయినా అద్దె ఇంట్లో ఉండేవారు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థితో పాటు నాయకులు గ్రామాలకు వచ్చినా నేరుగా ప్రచారానికి వెళ్లే వారు కాదు. గ్రామంలోని ఐదారుగురు పెద్ద మనుషులతో మాట్లాడి ఒక చోట సమావేశాన్ని ఏర్పాటు చేసే వారు. గ్రామంలోని సమస్యలు తెలుసుకుని గెలిస్తే పరిష్కస్తామని హామీ ఇచ్చే వారు. గ్రామ పెద్దల మాట మీద వారికి ఓటు వేసే వాళ్లం. ఇప్పుడు ఎన్నికలంటే ఖర్చుతో కూడు కూడుకున్నాయి. అప్పట్లో మద్యం, డబ్బులు పంపిణీ చేసే వాళ్లు కాదు. ఆకు వక్క ఇచ్చినా గ్రామంలో తీసుకునే వాళ్లు కారు. నిజాయితీగా ఓటు వేసే వాళ్లు.

- మేళవాయి నారాయణరెడ్డి



ఇంటికి వద్దన్నా ఓటు..!

బాగున్నవారికీ ఇంటి వద్దకా?.. బీఎల్ఓల రాకతో వెలుగులోకి..

హిందూపురం, ఏప్రిల్ 24: ఇంటి వద్దకే ఓటులో అధికార పార్టీ అడ్డదారులు తొక్కిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దివ్యాంగులు, 85 ఏళ్లపైబడిన వారికే ఇళ్ల వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. హిందూపురం మండలంలో ఎలాంటి వైకల్యమూ లేని చిన్నవయసు వారికీ ఇంటి వద్దకే ఓటు హక్కు కల్పిస్తామంటూ బీఎల్ఓలు ఒత్తిడి తేవడం గమనార్హం. దీంతో ఓటర్లు అవాక్కవుతున్నారు. హిందూపురం మండలం వీవర్స్ కాలనీలోని 134, 135, 136 పోలింగ్ బూత్‌లలో ఇలాంటివి వెలుగులోకి వచ్చాయి. వాటి పరిధిలోని బీఎల్ఓలు బుధవారం ఓటర్ల ఇళ్ల వద్దకెళ్లి 13డి ఫారాలు ఇచ్చారు. సంతకం పెట్టాలని ఒత్తిడి తెచ్చారు. 134 బూత్ పరిధిలో వి.చిరంజీవికి ఇంటి వద్దే ఓటు వినియోగించుకోవచ్చనీ, 12డి ఫారంలో సంతకం చేయాలని ఒత్తిడి చేశారు. తనకెందుకు ఇంటివద్ద కనీ, పోలింగ్ కేంద్రం వద్దకొచ్చి ఓటేస్తానని అతడు చెప్పాడు. పైఅధికారులు చెప్పారనీ, నోటీసు తీసుకుని సంతకం పెట్టాలని బీఎల్ఓ కోరారు. అనుమానం వచ్చి సంతకం పెట్టడానికి నిరాకరించారు. చిరంజీవి వయసు 40 ఏళ్లు, ఎలాంటి వైకల్యమూ లేదు. అయినా ఎందుకిచ్చారో అర్థంకాని పరిస్థితి. అదే ప్రాంతంలో సుగణ వయసు 43 ఏళ్లు. ఈమెకు నోటీసు ఇవ్వడానికి వెళ్లారు. 35 ఏళ్ల నేత్రావతికి 12డి ఫారం తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. వారు ససేమిరా అన్నారు.

కేంద్రానికి 30 నుంచి 40 ఓట్లు..

నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఇలాంటివి 30 నుంచి 40 ఓట్లు ఉన్నాయని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బుధవారం మూడు బూత్‌లు మాత్రమే వెలుగులోకి వచ్చాయనీ, పూర్తిగా ఆరాతీస్తే నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు వెలుగులోకి వస్తాయో అర్థంకాని పరిస్థితి. ఈ లెక్కన నియోజకవర్గంలో 250 బూత్‌లున్నాయి. ఇలా 30 నుంచి 40 ఓట్లు లెక్కన కనీసం 10వేల ఓట్లు ఇలాంటివి ఉండవచ్చని టీడీపీ నాయకులు భావిస్తున్నారు.

వలంటీర్ల పనేనా?

ఓటరు జాబితా పరిశీలన సందర్భంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా ఇలాంటి ట్రిక్ చేసినట్లు ఓటర్లు భావిస్తున్నారు. అప్పట్లో బాగున్నా.. వైకల్యముందనీ, తక్కువ వయసున్నా ఎక్కువ ఉన్నట్లు ఆన్‌లైన్‌లో పొందుపరిచారని సమాచారం. అప్పుడు వలంటీర్లు ఇచ్చిన జాబితా మేరకే ప్రస్తుతం నోటీసులు తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఈనెల 26న తుది ఓటర్ల జాబితా రానున్న నేపథ్యంలో రెండు రోజుల ముందు ఇలాంటివి వెలుగులోకి రావడంతో టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పని ఎవరు చేసి ఉంటారని ఆరాతీస్తున్నారు. ఇప్పటి వరకు ఓటర్ల జాబితా సక్రమంగా ఉందా.. లేదా అని టీడీపీ నాయకులు చూసుకుంటున్నారు. ఇలాంటి ట్రిక్ చేశారని తెలియదు. బుధవారం బీఎల్ఓలు నోటీసులు తీసుకెళ్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజులుగా వైసీపీ నాయకులు బహిరంగంగా తమకు 10 వేల నుంచి 15వేల ఓట్లు ఫిక్స్‌డ్‌గా ఉన్నాయనీ, అవి ఎలా పడతాయో నెలాఖరున తెలుస్తుందని చెప్పుకుంటున్నారు. ఈ ఓటరు జాబితాకు సంబంధించి గత వారంలో మంత్రి పెద్దిరెడ్డి హిందూపురం ముఖ్య నేతలను పిలిపించుకుని మాట్లాడినట్లు సమాచారం. తమకు 20వేల ఓట్లు ఫిక్స్‌డ్‌గా ఉన్నాయనీ, తుది ఓటరు జాబితా ప్రకటించాక తెలుస్తుందన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 12డి ఫారాలను అందజేస్తుండడాన్ని బట్టి చూస్తే మంత్రి చెప్పిన మాట నిజమేనని టీడీపీ నాయకులు అంటున్నారు. ఇలాంటివి ఎన్ని ఉన్నాయో గుర్తించి ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.



క్రియాశీలకం

కియ రాకతో ఇంటర్న్‌షిప్ అవకాశాలు మెండు... పాఠ్యాంశాల్లోని అంశాలపై ప్రాక్టికల్‌గా తర్ఫీదు
శిక్షణతోపాటు పారితోషికం... ఏటా వేల మంది సద్వినియోగం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 24: పరిశ్రమలు ఆయా ప్రాంతాల అభివృద్ధికి పర్యాయపదాలుగా నిలుస్తున్నాయి. పరిశ్రమ ఎక్కడైతే ఏర్పాటవుతుందో ఆ ప్రాంత రూపురేఖలు సమూలంగా మారిపోతాయి. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు పుష్కలంగా దొరుకుతాయి. దీంతో వారు ఓ వైపు చదువు కొనసాగిస్తూనే ప్రతి నెలా వేలల్లో పారితోషికాన్ని పొందే అవకాశం ఏర్పడుతుంది. పైగా ఇక్కడ ప్రాక్టికల్‌గా సంపాదించుకున్న జ్ఞానంతో భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఉమ్మడి జిల్లాకు కియ రావడంతో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడానికి మంచి అవకాశమేర్పడింది. అక్కడ పాఠ్యాంశాల్లోని అంశాలపై ప్రాక్టికల్‌గా తర్ఫీదు ఇస్తారు.

వేలమందికి ఇంటర్న్‌షిప్..

కియ దాని అనుబంధ పరిశ్రమలతో ప్రతి సంవత్సరం వేలమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లభిస్తోంది. నాలుగు సంవత్సరాల బీటెక్, మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు భౌతికంగా తర్ఫీదునిస్తూ ప్రతిభావంతులుగా తీర్చుదిద్దుతున్నాయి. ఇంటర్న్‌షిప్‌లో మెరుగైన నైపుణ్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులను ఉద్యోగాల్లోకి తీసుకుం టున్నాయి. దీంతో కళాశాలల యాజమాన్యాలు వారి విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు పంపడానికి పోటీపడుతున్నాయి. పరిశ్రమలిస్తున్న ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్స్‌తో బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.

పరిశ్రమలతోనే..



పాలిటెక్నిక్ కోర్సులకు అనుగుణంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఒకే సమ యంలో శిక్షణతో పాటు కోర్సు పూర్తి అవుతుంది. కియ, దాని అనుబంధ పరిశ్రమలతో వేలాది మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లభిస్తోంది. అదేవిధంగా పారితోషికాన్ని చెల్లించడమే కాకుండా ఉచిత భోజన, రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆసక్తిగా ఇంటర్న్‌షిప్ చేస్తూ శిక్షణ పొందుతున్నారు.

- రామచంద్రారెడ్డి, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

ప్రాక్టికల్‌గా పట్టు సాధిస్తున్నారు



తరగతిలో అభ్యసించిన పాఠ్యాంశ సారాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ పొంది వాటిపై పట్టు సాధిస్తున్నారు. విద్యార్థులు సొంతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఇంటర్న్‌షిప్ దోహదపడుతోంది. కరువు జిల్లాలో కియ పరిశ్రమ విద్యార్థులకు ఒక వరం. తాడిపత్రిలో అల్ట్రాటెక్ వంటి పరిశ్రమలు ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. చెన్నై వంటి నగరాల్లో పెద్దపెద్ద పరిశ్రమలకు విద్యార్థులు వెళ్తున్నారు.

- రామాంజనేయులు, పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజనీరింగ్ లెక్చరర్

రూ.13వేల పారితోషికం



ఇంటర్న్‌షిప్‌తోపాటు నెలకు రూ.13వేల పారితోషికాన్ని చెల్లిస్తున్నారు. అనంతపురం నుంచి ఉచితరవాణా. క్యాంటీన్‌లో భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను పరిశ్రమలో ప్రాక్టికల్‌గా నేర్చుకోవడం మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. ఇలాంటి పరిశ్రమలు మరిన్ని ఉంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకడమే కాకుండా వేలాదిమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా శిక్షణ దొరుకుతుంది.

- వీరేష్, పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి

సులువుగా ఉద్యోగాలు పొందవచ్చు



ఇంటర్న్‌షిప్ పూర్తి చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలను సులువుగా పొందవచ్చు. తాడిపత్రి బుగ్గలోని అల్ట్రాటెక్ పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశా. అందుకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. భౌతికంగా పరిశ్రమల్లో పనిచేయడం ద్వారా కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మార్గాలను అన్వేషించవచ్చు. కోర్సులకు అనుగుణంగా పరిశ్రమలు లేకుంటే చదువుకున్న విద్యకూడా వృథా అవుతుంది.

- మోహనయ్య, పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి

కొత్త అనుభూతి ఇస్తున్న కియ



కియ రాక ఆ ప్రాంత రూపురేఖలను మార్చేసింది. అక్కడ ఇంటర్న్‌షిప్ చేయడం కొత్త అనుభూతిని ఇస్తుంది. కళాశాలలో నేర్చుకోవడం కన్నా భౌతికంగా పరిశ్రమలో శిక్షణ పొందుతూ నేరుకుంటే సబ్జెక్టుపై పట్టుపెరుగుతుంది. అంతర్జాతీయ సంస్థల్లో కూడా సులువుగా పని చేసేందుకు దోహదపడుతుంది. ప్రతి నెలా పారితోషికాన్ని చెల్లిస్తూ ఉచిత రవాణా, క్యాంటీన్ సౌకర్యాన్ని కల్పించడం నాలాంటి విద్యార్థుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతుంది.

- సప్తగిరివర్మ, పాలిటెక్నిక్ విద్యార్థి



వైసీపీని వీడుతున్నట్లు ప్రకటిస్తున్న బత్తలపల్లి జడ్పీటీసీ కోటి సుధ, కురుబ కార్పొరేషన్ చైర్మన్ సూర్యప్రకాశ్ బాబు, మరికొందరు (ఫైల్)



జగన్ పార్టీకి ఝలక్..!

వైసీపీకి గుడ్‌బై చెబుతున్న జడ్పీటీసీ, ఎంపీపీలు
పనులు సాగక తీవ్ర అసంతృప్తి
ఎటూ ఓడే పార్టీ అంటూ వీడుతున్న సభ్యులు
ఇప్పటికే ఇద్దరు జడ్పీటీసీలు దూరం
ఒక ఎంపీపీ సైతం రాజీనామా
అదే దారిలో మరికొందరు..

అనంతపురం విద్య, ఏప్రిల్ 24: ఎన్నికల వేళ అధికార పార్టీకి జడ్పీటీసీలు, ఎంపీపీలు షాక్ ఇస్తున్నారు. రోజుకొకరు పార్టీని వీడుతున్నారు. ఏళ్ల తరబడి వైసీపీలో ఉన్నా తాము ఎలాంటి పనులు చేసుకోలేకపోతున్నామన్న నిరాశ వారిలో కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జడ్పీటీసీలకు ఏమాత్రం ప్రాధాన్యం లేకుండాపోయింది. దీంతో మండలాల్లో అభివృద్ధి చేసుకోలేక, ప్రజలకు సమాధానం చెప్పలేక వారు జగన్ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. టీడీపీ కూటమికి గెలుపు అవకాశాలు పెరుగుతున్నాయని భావించి.. అత్యధికులు కూటమి వైపు చూస్తున్నారు.

వలసలు మొదలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు వైసీపీని వీడుతున్నారు. కూటమి పార్టీల్లో చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. జడ్పీ ఎన్నికలు గతంలో ఏకపక్షంగా సాగాయి. దీంతో టీడీపీ, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కొక్కరు మాత్రమే గెలిచారు. మిగిలిన స్థానాలన్నీ వైసీపీకి సొంతమయ్యాయి. అంతటి హవాలో సైతం అగళిలో టీడీపీ అభ్యర్థి జడ్పీటీసీగా గెలిచి నిలిచారు. ఇంతమంది గెలిచినా.. వైసీపీ జడ్పీటీసీలకు ఆ పార్టీ న్యాయం చేయలేదు. రెండున్నరేళ్ల నుంచి వారిలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇటీవలే చిలమత్తూరు వైసీపీ జడ్పీటీసీ అనూష టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ వర్గానికి చెందిన అనూషతోపాటు పలువురు ఎంపీటీసీలు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా బత్తలపల్లి జడ్పీటీసీ కోటి సుధ వైసీపీకి రాజీనామా చేశారు. ఆమెతోపాటు ఆమె భర్త, కురబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాశ్‌బాబు మరికొందరు సైతం జగన్ పార్టీ గుడ్‌బై చెప్పారు. సూర్యప్రకాశ్‌బాబు, ఆయన సతీమణి, బత్తలపల్లి జడ్పీటీసీ సభ్యురాలు కోటిసుధ, ఆయన సోదరులు ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేశ్, ఉపసర్పంచ్ కోటి గోపీనాథ్‌తో పాటు పలువురు బీజేపీలోకి చేరారు. వారు పట్టణంలో మంగళవారం కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో, కేంద్రమంత్రి విజయ్‌కుమార్ సింగ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కోటి కుటుంబానికి బత్తలపల్లి మండలంలో బలమైన వర్గం ఉంది. వీరి చేరికతో బత్తలపల్లిలో బీజేపీ బలం అమాంతం పుంజుకుంది. అదేవిధంగా ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సైతం వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనను గత కొంత కాలంగా స్థానిక ఎమ్మెల్యే తీవ్రంగా వేధించినట్లు, అభివృద్ధి పనులు సైతం సాగకుండా అడ్డుపడినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో అభివృద్ధి శూన్యం అని భావించి ఆయన బీజేపీలో చేరారు. ధర్మవరం నియోజకవర్గం కూటమి అభ్యరి సత్యకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు జగన్ పార్టీ మునిగే నావగా భావించి టీడీపీ కూటమి వైపు చూస్తున్నారు.

త్వరలో మరికొందరు...

ఇప్పటికే జడ్పీటీసీలు, ఎంపీపీలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గత రెండున్నరేళ్లగా నిధులు రాక, అభివృద్ధి లేక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు జడ్పీకి వస్తే.. ఇక్కడి ఉన్నతాధికారులు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని, పాలకవర్గాన్ని పూర్తిగా విస్మరించి ముందుకెళ్తన్నా రంటూ ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలోనే జడ్పీ చైర్పన్‌తోపాటు, సుమారు 30 మంది వరకూ జడ్పీటీసీలు సీఈఓ, డిప్యూటీ సీఈఓపై ఫైర్ అయ్యారు. సమావేశాన్ని బహిష్కరించి, బయటకొచ్చి ఆందోళన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కనీసం స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించలేదు. ఇలాంటి పరిస్థితుల నడుమ వైసీపీలో ఉన్నా మండలాల్లో అభివృద్ధి సాధించలేమన్న యోచనలో మెజార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు ఉన్నారు. దీంతో టీడీపీ- బీజేపీ కూటమిలో చేరేందుకు మెజార్టీ సభ్యులు ఉత్సాహం చూపుతున్నారు. సుమారు 25 నుంచి 30 మంది వరకూ జడ్పీటీసీలు కూటమి బాట పట్టనున్నట్టు ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది.



వైసీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన ముదిగుబ్బ ఎంపీపీ (ఫైల్)



దుమ్ములోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో...?

అనంత నడిబొడ్డు టవర్‌క్లాక్ వద్ద దుస్థితి... రాకపోకలకు తీవ్ర అంతరాయం



శాంతి థియేటర్ వైపు సర్వీస్ రోడ్డు..

అనంతపురం సిటీ, ఏప్రిల్ 24 : నగరంలో అత్యంత ప్రధానమైన రహదారులలో పీటీసీ ఫ్లైఓవర్ బ్రిడ్జి ముఖ్యమైనది. కేంద్రం ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.311.93 కోట్లు వెచ్చింది. 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఈ బ్రిడ్జికి ఒకవైపు (శాంతి థియేటర్, బెంగుళూర్ బేకరీ షాపు వైపు) సర్వీస్ రోడ్డు ఏళ్ల తరబడి నిర్మాణ పనులు చేయకపోవడంతో అవస్థల నడుమ వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే, మేయర్ తదితర ప్రజాప్రతినిధులకు నిత్యం ఈ సమస్య కనిపిస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. కొందరు ప్రైవేట్ స్థలాల వ్యక్తులు పనులు చేస్తుంటే.. ఆ రోడ్డుపైకి దుమ్ము లేస్తోంది. ఆయినప్పటికి ఏ ఒక్కరు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే మాత్రం.. బ్రిడ్జిని అన్ని హంగులతో పూర్తి చేశాం.. త్వరలోనే ఈ సర్వీస్ రోడ్డును పూర్తి చేస్తాం అని చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని నగర వాసులు విమర్శిస్తున్నారు. వాహనచోదకులు, పాదచారుల, సర్వీస్ రోడ్డు వెంబడి ఉన్న దుకాణాల యజమానుల పరిస్థితి ఏమిటో ఈ చిత్రాలు చూస్తే తెలిసిపోతుంది. ఈ రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉండటంలో ఏమాత్రం వ్యాపారాలు జరగడం లేదని వాపోతున్నారు.

ఎల్‌ఎంకు అవమానం!

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 24: నియోజకవర్గంలో పట్టున్న వైసీపీ సీనియర్ నాయకుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డికి అవమానం జరిగిందని ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తలారి రంగయ్య బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆయన్ను రోడ్‌షోకే పరిమితం చేశారు. నెల రోజుల కిందట పార్టీలోకి వచ్చిన ఉమామహేశ్వర నాయుడుని మాత్రం నామినేషన్ దాఖలు చేయడానికి వెంట పెట్టుకుని ఆర్‌ఓ వద్దకు వెళ్లడంపై ఎల్‌ఎం అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనుచరులు, పట్టున్న సీనియర్ నాయకుడికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. నామినేషన్ కార్యక్రమానికి పిలిచి అవమానించడంలో ఆంతర్యమేమిటని నిలదీస్తున్నారు.



వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య నామినేషన్ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌ఎం మోహన్‌రెడ్డి

చెప్పులు వేయించుకున్నవారికి ఎంపీ టిక్కెట్టా?

వైసీపీ రెబల్ ఎంపీ అభ్యర్థి గంపల రమణారెడ్డి



వెంకటరమణా రెడ్డి

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 24: 'రాష్ట్ర చరిత్రలో రెండుసార్లు చెప్పులు వేయించుకున్న నాయకుడు మాజీమంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ మాత్రమే. అలాంటి నాయకుడికి ముఖ్యమంత్రి జగన్ ఎంపీ టిక్కెట్ ఇవ్వడం బాధాకరం' అని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గంపల రమణారెడ్డి అన్నారు. గోరంట్ల మండలం కరావులపల్లికి చెందిన రమణారెడ్డి అనంతపురం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు బుధవారం పెనుకొండలో మీడియాకు వివరించారు. గడచిన నాలుగున్నరేళ్లలో శంకర్‌నారాయణ ఎంత వేధించినా వైసీపీని వీడలేదన్నారు. వైసీపీకి చెందినవారిపైనే శంకర్‌నారాయణ 50 కేసులు బనాయిస్తే అందులో తమ సామాజికవర్గానికి చెందిన వారే 48 మంది బాధితులు ఉన్నారన్నారు. పలుమార్లు మా సమస్యలను ముఖ్యమంత్రి, ఇతర నేతలవద్దకు తీసుకెళ్తే దగ్గరకు రానీయలేదన్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం పునరాలోచించాలని అన్నారు.



టవర్‌క్లాక్ వద్ద ఎండిపోయిన మొక్కలు

ఎంత సుందరమో..!

అనంతపురంలో ఏ రోడ్డు చూసినా నల్లగో లేక తెల్లగో కనపడుతున్నాయి కానీ ఎక్కడే కాసింత పచ్చదనమన్నది లేకుండా పోయింది. నగరాన్ని సుందరీకరించి, పచ్చదనంతో నింపుతామన్న పాలకుల మాటలు గాలిలో కలిసిపోయాయి. రూ. లక్షలు ఖర్చు పెట్టి నగరంలోని పలు రహదారుల డివైడర్ల మధ్యలో మొక్కలు నాటారు. అయితే వాటి ఆలనాపాలన పట్టించుకోకపోవడంతో ఎండల దెబ్బకు అవన్నీ ఎండిపోయాయి. నగరంలో ఏ రోడ్డు డివైడర్లను చూసినా ఎండిన మొక్కలు లేదా... వాటి మధ్య పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

- అనంతపురం ప్రెస్‌క్లబ్



ఎన్టీఆర్ మార్గ్ వద్ద దుస్థితి

అప్పుడు సారా.. ఇప్పుడు టెట్రా

ఎన్నికల వేళ ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24: ఎన్నికలు వస్తే చాలు గతంలో కర్ణాటక ప్రాంతం నుంచి కుప్పలు తెప్పలుగా సారా ప్యాకెట్లు తెచ్చి ఓటర్లకు పంచేవారు. అక్కడ సారా ప్యాకెట్ ఒక్కోటి రూ. 5లు నుంచి రూ. 7లు వరకు ఉండేది. అందుకే ఓటింగ్‌కు కొన్ని రోజుల ముందుగానే అభ్యర్థులు వాటిని తెప్పించి డంప్ చేసుకునే వారు. పోలింగ్ ముందు రోజు, లేదా పోలింగ్ రోజు వాటిని ఓటర్లకు పంచే వారు. ఈక్రమంలో ఆంధ్రా ప్రాంతంలో ఎన్నికలు జరుగుతున్నాయంటే కర్ణాటకలో మద్యానికి మంచి డిమాండ్ ఉండేది. సరిహద్దు ప్రాంతాలైన పెద్ద పల్లి, కొత్తకోట, పావగడ, టుంకూరుకు వెళ్లి ముందుగానే సారా ప్యాకెట్లు తెప్పించేవారు. అయితే మన రాష్ట్రంలో సారాను నిషేధించడంతో వాటి స్థానంలో ప్రస్తుతం టెట్రా ప్యాకెట్లు వస్తున్నాయి. కర్ణాటక నుంచి ఆంధ్ర సరిహద్దు నియోజకవర్గాలకు కుప్పలు తెప్పలుగా టెట్రా ప్యాకెట్లు తెప్పించుకుంటున్నారు. ఇక్కడి మద్యం ధరల కంటే కర్ణాటక టెట్రా ప్యాకెట్ల ధరలు తక్కువగా ఉండటమే డిమాండ్‌కు ప్రధాన కారణం. ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, సమావేశాల్లో టెట్రా ప్యాకెట్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది.

65 ఏళ్ల తర్వాత ఊళ్లోనే ఓటు



మరుట్ల 1వ కాలనీ గ్రామంలోని పాఠశాల

కూడేరు, ఏప్రిల్ 24 : ఆ గ్రామ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే దాదాపు 3 కిలోమీటర్లు నడవాల్సి వచ్చేది. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో ఆ గ్రామంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో వారికి నడక కష్టాలు తప్పాయి. కూడేరు మండలం మరుట్ల 1వ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తుండడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 65 సంవత్సరాల క్రితం పెనకచెర్ల డ్యాం నిర్మాణం చేపట్టగా, అక్కడ నివాసమున్న ప్రజలకు ప్రభుత్వం పునరావాసం కింద మూడు ప్రదేశాల్లో స్థలాలు కేటాయించింది. వీటికి మరుట్ల 1, 2, 3వ కాలనీలుగా పేర్లు పెట్టారు. గ్రామానికి గ్రామానికి మధ్య దాదాపు మూడు కిలోమీటర్లు దూరం ఉంది. మరుట్ల 1వ కాలనీ, 2వ కాలనీ ఓటర్లకు 2వ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో మరుట్ల 1వ కాలనీ వాసులు ఓటు వేయడానికి 2వ కాలనీకి వెళ్లాలంటే వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పోలింగ్ కేంద్రాన్ని తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని 1వ కాలనీ వాసులు అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ప్రస్తుతం మరుట్ల 1వ కాలనీలో 952 మంది ఓటర్లు ఉండగా, అందులో 478 మంది పురుషులు, 472 మంది మహిళలు ఉన్నారు. తమ గ్రామంలోనే ఓటు వేసుకోనే అవకాశం 65 ఏళ్ల తర్వాత వచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

టెండర్, చాలెంజ్ ఓటు అంటే..



ధర్మవరం, ఏప్రిల్ 24: ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియలో టెండర్ ఓటు, చాలెంజ్ ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. టెండర్ ఓటు అంటే ఏమిటి? చాలెంజ్ ఓటు అంటే ఏమిటి? ఎలాంటి పరిస్థితుల్లో ప్రిసైడింగ్ అధికారి ఇలాంటి ఓటు వేసేందుకు అనుమతిస్తారో తెలుసుకుందాం.

చాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి అసలైన ఓటరు కాదని పోలింగ్ ఏజెంటుకు అనుమానం వస్తే అతడి గుర్తింపును ప్రశ్నించవచ్చు. రూ.2 ప్రిసైడింగ్ అధికారికి ఫీజుగా చెల్లించి దీనిపై విచారణ కోరవచ్చు. అప్పుడు సంబంధిత ఓటరును ధ్రువీకరణ కోసం తగిన ఆధారాలు చూపించాలని కోరుతారు. ఈ విచారణలో అతను అసలైన ఓటరే అని నిర్ధారణ అయితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఇలా చేయడాన్ని చాలెంజ్ చేసే హక్కు(రైట్ టుచాలెంజ్) అంటారు. ఒక వేళ అసలైన ఓటరు కాదని తెలితే ప్రిసైడింగ్ అధికారి అతడిని పోలీసులకు అప్పగించే అవకాశం ఉంది.


టెండర్ ఓటు

ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లిన వ్యక్తికి తన ఓటును అప్పటికి ఎవరో వేసినట్టు తేలితే అతడికి టెండర్ ఓటు వేసేందుకు వీలుంటుంది. టెండర్ ఓటు కోసం ఓటరు అడిగినప్పుడు ప్రిసైండింగ్ అధికారి అతడికి ఒక బ్యాలెట్‌పేపర్ ఇస్తారు. ఓటు వేసిన తరువాత దీన్ని ఒక కవరులో ఉంచిసీల్ చేసి భద్రపరుస్తారు. టెండర్ ఓటును ఈవీఎంలో వేయడం సాధ్యం కాదు.

గంపెడు మట్టి వేసి ఉంటే..



ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 24: వైసీపీ ఐదేళ్ల పాలనతో గుంతలు పడ్డ రోడ్డుపై తట్టెడు మట్టి వేసి ఉన్నా ఇంత అధ్వానంగా ఉండేవి కావని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రం నుంచి నారప్పగారిపల్లి, వెం కటాపురం, తుమ్మలకుంట్లపల్లి మీదుగా వెళ్లే రహదారి కొన్నేళ్లుగా కంకర తెలి ఉంది. దీనిపై ప్రయాణమంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పుడు ఎలక్షన్ టైం వచ్చింది మా సత్తా చూపిస్తామంటూ హెచ్చరిస్తున్నారు.



కళ్యాణదుర్గానికి తలమానికంగా మారిన అక్కమాంబ దేవత ఈ కొండలోనే వెలసినది

నియోజకవర్గ చరిత్ర

ముగ్గురు మంత్రులు పాలించినా ఉపాధి శూన్యం	బెంగళూరుకు నిత్యం వలసలు	వ్యవసాయంలో జాతీయ స్థాయిలో గుర్తింపు	హార్టికల్చర్ హబ్‌గా రికార్డుల్లోకి ఎక్కిన కళ్యాణదుర్గం

స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించిన కళ్యాణదుర్గం ప్రాంతం సమరయోధుల పుట్టినిల్లుగా ఖ్యాతిగడించింది. పూర్వం నుంచి పోరాటాలకు, చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. ఎంతమంది నేతలు వచ్చినా అభివృద్ధిలో ఇంకా వెనుకబడే ఉంది. సరైన ఉపాధి అవకాశాలు లేక ఇక్కడి నుంచి కూలీలు నిత్యం కర్ణాటకకు వలసలు వెళుతుంటారు. వ్యవసాయ రంగంలో నియోజక వర్గానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఉద్యాన పంటలు పండించడంలో ఇక్కడి రైతులు అగ్రభాగాన ఉంటారు. అందుకే హార్టికల్చర్ హబ్‌గా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి గుర్తింపు ఉంది.

సమరయోధుల దుర్గం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24: కళ్యాణదుర్గం అనే పేరు 16వ శతాబ్దంలో పాలెగర్ బోయ కళ్యాణప్ప నుంచి కళ్యాణదుర్గం అనే పేరు వచ్చిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. తరువాత బ్రిటిష్ పరిపాలన 1893 లో మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి విడదీసి ప్రత్యేకంగా కళ్యాణదుర్గం తాలూకాను ఏర్పరిచారు. చోళ రాజులు కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి మండలాలను పరిపాలించారు. ఈ ప్రాంతంలో చెరువులు, దేవాలయాలు కూడా నిర్మించారు. కంబదూరులో చోళ రాజులు 13 వ శతాబ్దంలో మల్లేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. అప్పటికి 1500 జనాభాతో ఏర్పడిన పట్టణం క్రమంగా విస్తరించి 2011 జనాభా లెక్కల ప్రకారం 30 వేలు జనాభా ఉన్నా, నేటికి ఆ సంఖ్య కనీసం దాదాపు 60 వేలకు దాటిపోయింది. చిన్న గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మేజర్ పంచాయతీ, తరువాత 2012లో మున్సిపాలిటీగా కళ్యాణదుర్గం రూపాంతరం చెందింది.

టీడీపీ కంచుకోట

తెలుగుదేశం పార్టీకి కళ్యాణదుర్గం కంచుకోట అనే పేరు ఉంది. ఇక్కడ బీసీ ఓట్లు అధికంగా ఉండడంతో ఈ ప్రాంత ప్రజలు టీడీపీ వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో ఐదుసార్లు టీడీపీ అభ్యర్థులు విజయాన్ని సాధించారు. టీడీపీ అభ్యర్థులే అత్యధిక మెజార్టీ సాధించారు. 1987, 1994, 1999, 2004, 2014 లో టీడీపీ అభ్యర్థులే విజయాన్ని సాధించారు.



పోరాటాల పురిటిగడ్డ

స్వాతంత్ర్య సంగ్రామంలో ఆంగ్లేయులపై ఎదురుదాడి చేసి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ఈడిగ ఓబయ్య అలియాస్ ఇండియా ఓబయ్య కళ్యాణదుర్గం ప్రాంతానికి ఒక మార్గదర్శిగా చెరగని ముద్ర వేసుకున్నారు. 1918 జూలై 17న వ్యవసాయ కుటుంబంలో పాపన్న, లింగమ్మ దంపతులకు ఓబయ్య జన్మించారు. స్వగ్రామం కంబదూరులో పాఠశాల చదువు పూర్తి చేసి 1935-1937 లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేశారు. అదే సమయంలోనే కంబదూరులో దళితులు చదువుకోవాలన్న ఉద్దేశంతో పాఠశాల ప్రారంభించారు. 1941లో జరిగిన సత్యాగ్రహ ఉద్యమంలో హిందీ నరసప్ప, శెట్టూరు నారాయణశర్మ, ఉమాదేవి, గంగవరం క్రిష్ణమూర్తి ప్రధాన అనుచరులు అరెస్టయ్యారు. శెట్టూరు మండలం ఐదుకల్లు సదాశివన్ స్వాతంత్ర్య సమర యోధుడిగా చెరగని ముద్ర వేశారు. బ్రిటీష్ పోలీసుల పైశాచిక చర్యలకు ఎదురుతిరిగి కొన్ని సంవత్సరాలు బళ్లారి సెంట్రల్ జైల్లో గడిపారు. కళ్యాణదుర్గం, కదిరి ప్రాంతాల్లో భూస్వామ్య, పెత్తందారీ వ్యతిరేక పోరాటాలను కొనసాగించారు. ఈయన ఆశయాలను తెలుసుకున్న గాంధీజీ 1934 లో మచిలీపట్టణానికి వచ్చిన సందర్భంగా దగ్గరికి పిలిచి అభినందించారు.

బీసీలే అధికం

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎక్కువగా బీసీ కులాలే అధికంగా ఉన్నారు. బోయ 48,377 మంది, గొల్ల 28,301, కురుబ 29,483, ఈడిగ 1,097, చేనేత 2,909, వడ్డె 3,000, కుమ్మరి 1,704, కమ్మరి 1,110, చాకలి 1,010, కంసలి 903, లింగాయతులు 5,063 మంది ఉన్నారు. బీసీలే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మొత్తం 1,22,957 మంది ఉన్నారు. బీసీ ఓటర్లే ప్రతి ఎన్నికల్లోను కీలకంగా మారనున్నాయి.

తొలి ఎమ్మెల్యే నారాయణప్ప సంద

కళ్యాణదుర్గం నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా నారాయణప్ప సంద కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. ఆయన తన ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి బి.ఎర్రిస్వామిపై 8,476 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తొలి శాసనసభ్యుడిగా నారాయణప్ప 1952 లో ఎన్నికైయ్యారు.

2012 మార్చిలో మున్సిపాలిటీగా మార్పు

2012లో మంత్రి రఘువీరారెడ్డి హయాంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీగా ఏర్పాటైంది. దాంతో పాటు కళ్యాణదుర్గానికి రైల్వే మార్గం, అవుటర్ రింగ్, రెవెన్యూ డివిజన్, డీఎస్పీ కార్యాలయాలు, రూరల్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. మున్సిపాలిటీ మార్పు చెందడంతో రియల్ ఎస్టేట్ వేగం పుంచుకుంది.

దుర్గానికే తలమానికం అక్కమాంబ ఆలయం

కళ్యాణదుర్గానికే తలమానికంగా నిలిచింది అక్కమాంబ దేవాలయం. అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ నెలలో అక్కమాంబ జాతరను నిర్వహిస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. అక్కమాంబ దేవత ఈ కొండలో వెలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నారు. అక్కమాంబ దేవత ఆకారంలో కొండ కనిపిస్తోందని ఇక్కడ భక్తుల్లో అపారమైన నమ్మకం ఉంది. కంబదూరులో మల్లేశ్వరస్వామి దేవాలయాన్ని 13వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించారు. ఆరు అడుగుల శివలింగం, లేచి వచ్చే విధంగా ఉన్న నందీశ్వరుడు, నాలుగు రాతి స్తంభాలు, కోనేరు బావి, అందమైన శిల్పాలు ఈ దేవాలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రతి ఏటా మార్చిలో జరిగే శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణాన్ని వీక్షిస్తే కళ్యాణం జరుగుతుందని ఇక్కడి భక్తుల్లో అపారమైన నమ్మకం ఉంది. 2012 లో మంత్రి రఘువీరారెడ్డి మంత్రిగా, సీడబ్ల్యూసీ మెంబర్‌గా పనిచేసిన లక్ష్మీదేవమ్మ పేరుతో కృషి విజ్ఞానకేంద్రాన్ని కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేశారు. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు.

వ్యవసాయంలో జాతీయ గుర్తింపు

వ్యవసాయ రంగంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కర్బూజ, కళింగర, టమోటా, మామిడి, చీనీ, బొప్పాయి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, సపోట, వేరుశనగ తదితర పంటలను పడించడంలో ఇక్కడి రైతులు పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. కంబదూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల్లో ఈ పంటలను సాగు చేసే రైతులు చాలా మంది ఉన్నారు. సేంద్రియ ఎరువులతో కూడా పంటను పండించి ఆదర్శ రైతులుగా నిలిచారు. జిల్లాలోనే కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యవసాయంలో టాప్‌గా నిలిచింది. టీడీపీ హయాంలో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా ఎంపిక చేశారు. ఆదర్శ రైతులను ఎంపిక చేసి అవార్డులను కూడా అందచేశారు.

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1962	హిందీ నరసప్ప	కాంగ్రెస్	బి.రామప్ప	ఇండిపెండెంట్	3,120
1967	టీసీ మారెప్ప	ఇండిపెండెంట్	పక్కీరప్ప	సీపీఐ	6,469
1972	ఎం. లక్ష్మీదేవి	కాంగ్రెస్	టీసీ మారెప్ప	ఇండిపెండెంట్	15,721
1978	హిందీ నరసప్ప	జనతాపార్టీ	ఎస్.విశ్వనాథం	కాంగ్రెస్	3,427
1983	టీసీ మారెప్ప	ఇండిపెండెంట్	ఎస్.విశ్వనాథం	కాంగ్రెస్	21,779
1985	ఫక్కీరప్ప	సీపీఐ	లక్ష్మీదేవి	కాంగ్రెస్	25,020
1987	బీసీ గోవిందప్ప	టీడీపీ	లక్ష్మీదేవి	కాంగ్రెస్	4,798
1989	లక్ష్మీదేవి	కాంగ్రెస్	సంజీవయ్య	సీపీఐ	4,742
1994	బీసీ గోవిందప్ప	టీడీపీ	ఎం. లక్ష్మీదేవి	కాంగ్రెస్	56,078
1999	ఎ. శారదాంబ	టీడీపీ	ఏబీ శాంతిశివాజీ	కాంగ్రెస్	22,882
2004	బీసీ గోవిందప్ప	టీడీపీ	ఉమాదేవి	కాంగ్రెస్	9652
2009	రఘువీరారెడ్డి	కాంగ్రెస్	హనుమంతరాయచౌదరి	టీడీపీ	4,388
2014	హనుమంతరాయచౌదరి	టీడీపీ	బి.తిప్పేస్వామి	వైసీపీ	22319
2019	ఉషశ్రీచరణ్	వైసీపీ	ఉమామహేశ్వరనాయుడు	టీడీపీ	19,896

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

బ్రహ్మసముద్రం మండలంలో పురుషులు 17,241 మంది, మహిళలు 17055 మంది మొత్తం 34,297 మంది ఓటర్లు ఉన్నారు. కళ్యాణదుర్గం అర్బన్‌లో పురుషులు 17,311, మహిళలు 18506, ఇతరులు ఒకరు మొత్తం 35818 మంది ఓటర్లు ఉన్నారు. కళ్యాణదుర్గం రూరల్‌లో పురుషులు 19,044 మంది, మహిళలు 18,924 మంది, ఇతరులు ఇద్దరు మొత్తం 37,970 మంది ఉన్నారు. శెట్టూరు మండలంలో పురుషులు 16,961, మహిళలు 16,831, ఇతరులు ఒకరు మొత్తం 33,793 మంది ఓటర్లు ఉన్నారు. కుందుర్పి మండలంలో పురుషులు 21,757 మంది, మహిళలు 21,567, ఇతరులు ఒకరు మొత్తం 43,325 మంది ఉన్నారు. కంబదూరు మండలంలో పురుషులు 20,881, మహిళలు 21,353, ఇతరులు ఒకరు మొత్తం 42,235 మంది ఓటర్లు ఉన్నారు.

కళ్యాణదుర్గంలో ప్రధాన సమస్యలు

కళ్యాణదుర్గం ప్రజలను అడుగడుగునా సమస్యలు వెంటాడుతున్నాయి. పట్టణంలో దాదాపు 60 వేల మంది జనాభా వుంది. ప్రధానంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా వుంది. ఈ సమస్య ఐదేళ్ల కాలంలో మరీ దారుణంగా తయారైంది. కాలనీలో ఉన్న మురుగునీరు ప్రధాన రహదారులపైకి వస్తోంది. దీనికి తోడు డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో పాలకులు విఫలమవుతున్నారు. మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ వుండటంతో దోమలు, పందుల బెడద ఎక్కువగా వుండటంతో ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి సమస్య మరీ ఘోరంగా ఉంది. పట్టణ, గ్రామాలకు సత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి నీళ్లు వస్తున్నాయి. పట్టణంలో శ్రీరామ్‌రెడ్డి నీటి పైపులు తరచూ పగిలిపోతుండడంతో తాగునీరు రోడ్లపైకి రావడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీరు కూడా సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ప్యూరిఫైడ్ నీరు కొనాల్సిన పరిస్థితి ఏర్పడినది. కొన్ని గ్రామాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్యను బహిరంగంగానే తాగునీటి సమస్య వుందని అడ్డుకున్న సందర్భాలు కోకొల్లలుగా వున్నాయి. అలాగే ఖాళీ బిందెలతో ప్రజలు రోడ్డు ఎక్కిన పరిస్థితులు కూడా ఉన్నాయి. రహదారులు పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని రహదారులు కూడా నియోజకవర్గంలో దర్శనమిస్తున్నాయి. మంత్రి ఉషశ్రీచరణ్ ప్రచారానికి వెళ్లినప్పుడు కూడా కుందుర్పి మండలంలో కాన్వాయ్ వెళ్లలేని పరిస్థితుల్లో అతి కష్టం మీద ద్విచక్ర వాహనంపై వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. పట్టణంలో రోడ్ల విస్తీర్ణంలో భాగంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వుంది. వీధి దీపాలు, సీసీ రోడ్లు వంటి అనేక సమస్యలతో పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు.



పట్టణంలోని ఎర్రనేల వీధిలో పారుతున్న మురుగు నీరును చూపిస్తున్న మహిళలు

ముగ్గురు మంత్రులను ఇచ్చినా అభివృద్ధి శూన్యం

లక్ష్మీదేవమ్మ, రఘువీరారెడ్డి, ఉషశ్రీచరణ్ నియోజకవర్గం నుంచి మంత్రులుగా పనిచేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన లక్ష్మీదేవమ్మ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కంబదూరులోనే ఐసీడీయస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడి నుంచి కార్యకలాపాలు ఎక్కువగా సాగేవి. రెవెన్యూశాఖ మంత్రిగా పనిచేసిన రఘువీరారెడ్డి హయాంలో అవుటర్ రింగు రోడ్డు, రైల్వే లైన్, కార్యక్రమాలను చేపట్టారు. అయినా ఇక్కడ ఏ మాత్రం ఉపాధి అవకాశాలు లేవు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి సుమారు 20 వేల మందికి పైబడి ఉపాధి కోసం పక్క రాష్ట్రమైన కర్ణాటకలోని బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు సంవత్సరాల పొడవునా వలసలు వెళుతుంటారు.

1951లో నియోజక వర్గంగా మార్పు

1951లో కళ్యాణదుర్గం నియోజకవర్గంగా మార్పు చెందింది. ఈ నియోజకవర్గం 4,42,694 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. జనాభా 3,15,577 మంది ఉన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 2,27,438 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,13,195 మంది, మహిళలు 1,14,236 మంది ఉన్నారు. థర్డ్ జెండర్స్ 7 మంది ఉన్నారు. 1952 నుంచి 2019 వరకు 13 సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. టీడీపీ అభ్యర్థిగా బీసీ గోవిందప్ప 1994లో 56,078 ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ తరఫున హిందీ నరసప్ప 1962లో 3,120 ఓట్ల అత్యల్ప మెజార్టీతో గెలుపొందారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు సాగు, తాగు నీటిని అందించాలి. దాంతో పాటు నియోజకవర్గంలో వలసలు నివారించి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. టమోటా ప్రాసెసింగ్ యూనిట్, గ్రామీణ ప్రాంతాలకు రహదారి సౌకర్యంతో పాటు, రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలి.

ప్రచార శబ్దానికి పరిమితులు



ధర్మవరం, ఏప్రిల్ 24: కేంద్ర ఎన్నికల సంఘం పరిమితుల మేరకే అభ్యర్థులు, నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించాలి. ఎన్నికల ప్రచారంలో పర్యావరణ చట్టాలు, నిబంధనలను నేతలం తా పాటించాలి. మైకుల శబ్దాలతో హోరెత్తిస్తే చర్యలు తప్పవు. డీజేసౌండ్స్ పెద్ద పెద్ద స్పీకర్లతో గోల చేస్తే శబ్దకాలుష్యం కింద కేసులు పెడతామని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏయే ప్రాంతంలో ఎంత శబ్దం అనుమతి స్తారనే వివరాలు ఇలా ఉన్నాయి. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు జైలు శిక్ష పడే అవకాశముంది. ఆయాప్రాంతాల్లో ఉండాల్సిన శబ్ద తీవ్రత నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్, వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40 నుంచి 50 డెసిబుల్స్ వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65 డెసిబుల్స్ పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ మించి శబ్దం చేయరాదు.

ఓటరు గుర్తింపు కార్డుకు 29 ఏళ్లు



ధర్మవరం, ఏప్రిల్ 24: దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేం దుకు ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరును గుర్తించేందుకు, నకిలీ ఓట్లను అరికట్టేందుకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. ఈ గుర్తింపు కార్డులు అమలులోకి వచ్చి 29 సంవత్సరాలు పూర్తయింది. ఓటరు జాబితాల్లో ఉన్న క్రమసంఖ్య ప్రకారం ఫొటోను కార్డుపై ము ద్రించి ఇస్తున్నారు. ఐడికార్డుపై స్టాంప్‌సైజు ఫొటో, జనన తేదీ, చిరునా మా సైతం ముద్రిస్తారు. సీరియల్ నంబరు, హోలోగ్రామ్ స్టిక్కర్, కార్డును జారీ చేసిన అధికారి స్టాంపు, సంతకం కూడా ఉంటాయి. దీనిపై ముద్రించిన సీరియల్ నంబరు చాలా ముఖ్యం. ఎన్నికల క మిషన్ ఓటరు జాబితా డేటాను ఆన్‌లైన్‌లో ఉంచడంతో ఓటరు ఎన్నికల సంఖ్య సీరియల్ నంబరును సులభంగా తెలుసుకుంటున్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ ఓటర్ ఐడీ కార్డు అందజేస్తున్నారు. దీనిని ఇతర ప్రభుత్వపథకాలు పొందేందుకు, భారతీయ పౌరుడిగా గుర్తింపు కోసం, చిరునామా కోసం అధికారికంగా వినియోగించుకోవచ్చు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు




పార్టీలోకి చేరిన వారిలో దగ్గుబాటి ప్రసాద్, దగ్గుబాటిని గజమాలతో సత్కరిస్తున్న ప్రభుకుమార్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 24: అనంతపురం నగరంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం అనంతపురం అర్బన్ పరిధిలోని 13వ డివిజన్‌లో టీడీపీ నాయకురాలు లక్ష్మీనాయుడమ్మ ఆధ్వర్యంలో వైసీపీ నాయకుడు బండి కాశీతోపాటు మరో 50 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వీరిని దగ్గుబాటి ప్రసాద్ టీడీపీలోకి ఆహ్వానించారు. అలాగే నారాయణపురం గ్రామంలోని ఎఎస్ఆర్ నగర్‌కు చెందిన 60 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో నాయకులు మారుతీకుమార్ గౌడ్, కురబ నారాయణస్వామి, నాగరాజు, రాజేంద్ర, షౌకత్, రామకృష్ణ, ఆంజినేయులు, భార్గవ్ పాల్గొన్నారు.

దగ్గుబాటిని విమర్శించేస్థాయి నీకు లేదు

దగ్గుబాటి ప్రసాద్‌ను విమర్శించే స్థాయి వైసీపీ ఎస్సీ సెల్ నాయకులకు లేదని మాదిగ యువత రాష్ట్ర అధ్యక్షుడు మన్నల నాగార్జున ఒక ప్రకటనలో మండిపడ్డారు. దళితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఆదుకున్న ఘనత దగ్గుబాటి ప్రసాద్‌కు దక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో ఆరు వేలకుపైగా దళితులపై దాడులు జరిగాయన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

గజమాలతో సత్కారం

అనంతపురం సెంట్రల్: దగ్గుబాటిని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్ గజమాలతో సత్కరించారు. బుధవారం నామినేషన్ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి కూడలివద్ద దగ్గుబాటిని, ఎంపీ అభ్యర్థి అంబిక లక్ష్మీనారాయణను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్ బాబు, రాజేష్, రాజుమహేష్, బాలరాజు పాల్గొన్నారు.

ప్రకాశ్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలే

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత



ప్రచారంలో మాట్లాడుతున్న సునీత

రామగిరి : రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి నోరు తెరిస్తే అన్ని అబద్ధాలే చెబుతాడని కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత విమర్శించారు. ఆమె బుధవారం రామగిరి మండలంలోని పేరూరు పంచాయతీలోని ఏడు గుర్రాలపల్లి, కురుకుండ్లకాలనీ, సీకొత్తపల్లి, పెదయ్యగారికొట్టాల, దుబ్బార్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేరూరు డ్యాంకు నీరు తెచ్చామని, బంగారు గనులు తెరిపించామని అబద్ధాలు చెబుతున్న ఎమ్మెల్యేకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. ఈ ఐదేళ్లలో ప్రకాశ్‌రెడ్డి ఏమి అభివృద్ధి చేశారో ప్రజలు గుర్తించాలన్నారు. కాగా, పరిటాల సునీత కోడలు పరిటాల జ్ఞాన అనంతపురంరూరల్ మండలంలోని పాపంపేటలోని రంగారెడ్డి కాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

నేడు నామినేషన్

రాప్తాడు : రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పరిటాల సునీత నామినేషన్ వేయనున్నారని పరిటాల సిద్ధార్థ తెలిపారు. నామినేషన్ అనంతరం నిర్వహించే బహిరంగ సభకు అవసరమైన సభా స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన అందరికీ భోజనం సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కాగా, మరూరు టోల్ ప్లాజా నుంచి రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌చార్జ్ మురళి తెలిపారు.

ఎరా పాఠశాల వార్షికోత్సవం

అనంతపురంరూరల్: మండలంలోని రాచానపల్లి సమీపంలో ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ వినూత్నరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకోవడానికి పాఠశాలలో అన్ని సదుపాయాలున్నాయన్నారు. ఇతరుల పిల్లలతో తమ పిల్లలను పోల్చకూడదని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పిల్లలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, అడ్మినిస్ట్రేటివ్ దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చిరంజీవిరెడ్డి

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి, బోయ విద్యార్థులు ప్రతిభా పురస్కారాల కోసం ఈ నెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్య కుమార్, కోశాధికారి పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు 460 మార్కులు, ఆపైన వచ్చిన వారు, ప్రైవేట్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు 500 మార్కులు, ఆపైన వచ్చిన వారు అర్హులన్నారు. వివరాలకు 9440774519, 8309090406ను సంప్రదించాలని సూచించారు.


తుపాకీ మిస్‌ఫైర్‌తో సీఆర్పీఎఫ్ అధికారి మృతి



శేషగిరి మృతదేహం

భద్రాచలం, ఏప్రిల్ 24: తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో ఓ సీఆర్పీఎఫ్ అధికారి, జిల్లా వాసి మరణించాడు. అనంతపురం జిల్లాకు చెందిన శేషగిరి (47) భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో అటవీ ప్రాంతమైన పూసుగుప్పలోని పోలీస్ క్యాంపులో సీఆర్పీఎఫ్-81 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం అతను పాత పూసుగుప్ప గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. పైకిలేచి తన ఏకే-47 రైఫిల్‌ను సరి చేసుకుంటుండగా అది మిస్‌ఫైర్ అయ్యి బుల్లెట్ ఛాతిలోకి దూసుకెళ్లింది. గమనించిన సీఆర్పీఎఫ్ సిబ్బంది వెంటనే అతన్ని భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

వైసీపీ నామినేషన్ కార్యక్రమంలో వలంటీర్లు



నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న వై కొత్తపల్లి వలంటీర్లు

ఆత్మకూరు, ఏప్రిల్ 24: మండలంలోని వై కొత్తపల్లి గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు, ఒక డీలర్ ఎన్నికల నిబంధనను ఉల్లంఘించారు. రాజీనామాలు చేయకుండానే వారు వైసీపీ నేతల నామినేషన్ కార్యక్రమంలో వలంటీర్లు వెంకటరాముడు, మాల వెంకటేష్, నారాయణస్వామి, సువర్ణ, డీలర్ భాగ్యమ్మ పాల్గొన్నారు. అయితే ఈ విషయం సోషల్ మీడియాతో వైరల్ కావడంతో వలంటీర్లు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తమ రాజీనామా పత్రాలు అందజేసినట్లు సమాచారం.

నగర కమిషనర్‌పై బీఎస్పీ ఫిర్యాదు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 24: నగరపాలక సంస్థ కమిషనర్‌పై బీఎస్పీ అనంతపురం ఎంపీ అభ్యర్థి నారాయణప్ప జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్‌కు బుధవారం ఫిర్యాదుచేశారు. నగరంలోని కోర్టు రోడ్డులో బీఎస్పీ జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, ఎన్నికల నిబంధనలకు మేరకు అనుమతులు తీసుకుని బీఎస్పీ గుర్తు, కేంద్ర, రాష్ట్ర నాయకుల చిత్రాలతో కూడిన బ్యానర్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. అయితే నగరపాలక సంస్థ ముందస్తు నోటీసులివ్వకుండా, వివరణ తీసుకోకుండానే వాటిని తొలగించిందని అన్నారు. వాటిని తొలగించడం మోడల్ ప్రవర్తనా నియమావళికి, తమ హక్కులను హరించడమేనని అన్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన బుధవారం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రాములోరి పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం హనుమద్ సమేత సీతారామలక్ష్మణులకు వివిధ అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో వేదపండితుల స్వామివార్లకు పట్టాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తులను గజవాహనంపై పురవీధులగుండా ఊరేగించారు. ఊరేగింపు ముందు పూలకుంటకు చెందిన భజనబృందం నేతృత్వంలో భక్తులు రామకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు.

నేడు బండారు శ్రావణిశ్రీ నామినేషన్

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 24: తాను నామినేషన్‌ను గురువారం వేస్తున్నట్లు కూటమి శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ తెలిపారు. కావున ఆరు మండలాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తల, అభిమానులు పెద్దసంఖ్యలో ఉదయం 10 గంటలకు శింగనమల మరవకొమ్మ వద్దకు రావాలని పిలుపునిచ్చారు.

పెనకచెర్ల డ్యాంలో ప్రచారం



పెనకచెర్ల డ్యాంలో ప్రచారం నిర్వహిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె : శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి బుధవారం సాయంత్రం పెనకచెర్ల డ్యాం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి.. ప్రచారం నిర్వహించారు. గురువారం బండారు శ్రావణి శ్రీ నామినేషన్ వేస్తున్నారని, ఈ కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేనా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కాగా, పెనకచెర్ల డ్యాం గ్రామంలోని 10 వైసీపీ కుటుంబాలు ఆయన ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



వైష్ణవి, చర్మిళ, రిషిత, కార్తీక్, గణేష్

పుంగనూరు రూరల్: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌నాయుని గురుప్రసాద్ అభినందించారు.

ద్విచక్రవాహనం దగ్ధం

గార్లదిన్నె, ఏప్రిల్ 24 : శింగనమల మండలం లోలూరు క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనం దగ్ధమైంది. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన రైతు సంఘం అధ్యక్షుడు ఎండీ రాముడు, అదే గ్రామానికి చెందిన ఆదిరెడ్డి ఇద్దరు బైక్‌పై అనంతపురం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. లోలూరు సమీపంలోకి రాగానే బైక్‌కు వెనుకవైపున మంటలు వ్యాపించాయి. వెనుక వస్తున్న వాహనదారులు గుమనించి.. ఆ విషయాన్ని వారికి చెప్పారు. వెంటనే వారు బైక్ ఆపి.. ఆ మంటలు ఆర్పడానికి విఫలయత్నం చేశారు. అయితే ఆ వాహనం పూర్తిగా దగ్ధమైంది.

వేలం పాట ద్వారానే చీనీ అమ్మకాలు చేపట్టాలి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 24: అనంతపురం మార్కెట్ యార్డులో వేలం పాట ద్వారా మాత్రమే చీనీకాయల అమ్మకాలు చేపట్టాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... పాలకులు రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం వల్ల దళారుల చేతుల్లో మోసపోతున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈనాం విధానంలో రైతులకంటే కొనుగోలుదారులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యాపారులు సిండికేట్ అయి రైతుకు ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనామ్‌ను రద్దుచేసి మార్కెట్‌లో వేలంపాట ద్వారా అమ్మకాలు జరిపి, సూట్ తీసుకునే విధానాన్ని రద్దుచేసి సూట్‌కు చీనీ కాయలు కొనేవారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, బి.చంద్రశేఖర్‌రెడ్డి, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి ఉన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ అకాడమీకి రాహిల్ అహ్మద్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 24: తమిళనాడులోని సేలం జాతీయ బాస్కెట్‌బాల్ అకాడమీలో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న నగరానికి చెందిన రాహిల్ అహ్మద్ అర్హత సాధించాడు. అతన్ని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాకే హబీబుల్లా, నరేంద్రచౌదరి, డీఎస్‌డీఓ షఫీ అభినందించారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

గార్లదిన్నె, ఏప్రిల్ 24 : కూడేరు మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన గొర్రెల కాపరి కురుబ రాగే రాఘవేంద్ర (38) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పులు కూడా అధికమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను మంగళవారం రాత్రి శింగనమల మండలం లోలూరు సమీపంలోని భారత్‌బెంజ్ షోం రూం వెనుకవైపు రైలు కింద ఆత్మహత్య చేసుకున్నాడు. రాఘవేంద్ర భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఎస్ఐ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు.

వైభవంగా సంగమేశ్వరస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 24: మండలంలోని సింగానహళ్లి గ్రామ శివారులో వేదవతి హగరి నది ఒడ్డున వెలసిన సంగమేశ్వరస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా భారీ జనసందోహం మధ్య జరిగింది. వేకువజామున స్వామివారికి విశేష పూజలు జరిపించారు. సాయంత్రం స్వామివారి రథాన్ని లాగారు. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్కమాంబల విగ్రహ ప్రతిష్ఠ

బెళుగుప్ప, ఏప్రిల్ 24: మండల పరిధిలోని ఆవులెన్నలో బుధవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అక్కమాంబ దేవతల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. ముందుగా గ్రామంలో విగ్రహాలను ఊరేగించారు. దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం

యాడికి, ఏప్రిల్ 24: మండల కేంద్రంలో బుధవారం చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. స్థానిక పాతబడి నుంచి ప్రధాన రహదారి వెంబడి జ్యోతులు మోస్తూ ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

ఆకట్టుకున్న పార్వేట ఉత్సవం

కూడేరు, ఏప్రిల్ 24: జోడు లింగాల సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కుమ్మరివారి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పార్వేటోత్సవంలో నిర్వహించారు. ఉదయం ఆలయంలో వివిధ రకాల అభిషేకాలు పూజలు చేశారు. రాత్రి సమయంలో పరుష కావడంతో వివిధ ప్రాంతాలనుంచి భక్తులు ఎద్దుల బండ్లపైన, ట్రాక్టర్లు తదితర వాహనాల్లో చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఆలయ ఈఓ రమేష్ బాబు, ఆలయ కమిటీ ఛైర్మన్ రామదుర్గం కిష్టప్ప, అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 24: మండలంలోని కసాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో హనుమాన్ విజయోత్సవంలో భాగంగా బుధవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు తలారి పరుశురాముడు, ఆలయ అర్చకుడు మారుతిప్రసాద్, పాల్గొన్నారు.

వైసీపీ నామినేషన్... ట్రాఫిక్ తంటాలు..!


వాల్మీకి సర్కిల్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ తంటాలతో పట్టణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాల్మీకి సర్కిల్‌లో రోడ్డుపైనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు డప్పులతో హల్‌చల్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. కుందుర్పి, శెట్టూరు మండలాల నుంచి ఆర్టీసీ బస్సు, వాహనాలు రోడ్డు మధ్యలో ఇరుక్కుపోయాయి. ధర్మవరంకు వెళ్లే రహదారిలో కూడా నాయకులు, కార్యకర్తలు రోడ్డుపైనే గుమికూడడంతో వాహనాలు ఎటూ వెళ్లలేకపోయాయి. వాల్మీకి సర్కిల్‌లో బస్సులను ట్రాఫిక్ నుంచి తప్పించేందుకు పోలీసులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నామినేషన్ ప్రక్రియ అటుంచితే, ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు


వైష్ణవి చర్మిళ రిషిత కార్తీక్ గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

అఖండ మెజార్టీతో విజయం సాధిస్తాం

- అమిలినేని సురేంద్రబాబు
- వైసీపీ నామినేషన్ రోజునే భారీ షాక్
- టీడీపీలోకి భారీగా చేరికలు


టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24: కళ్యాణదుర్గంలో అఖండ మెజార్టీతో విజయం సాధిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. వైసీపీ నామినేషన్ రోజునే కళ్యాణదుర్గంలో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. టీడీపీలోకి బుధవారం భారీగా చేరారు. వారందరికీ అమిలినేని టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కళ్యాణదుర్గం మండలం బాల వెంకటాపురం గ్రామానికి చెందిన మూడు వైసీపీ కుటుంబాలు, కాపర్ల పల్లి గ్రామానికి చెందిన ఆరు వైసీపీ కుటుంబాలు, కుందుర్పి మండలం బెస్తరపల్లికు చెందిన 40 వైసీపీ కుటుంబాలు, బొమ్మాజీ పల్లికు చెందిన 15 వైసీపీ కుటుంబాలు, యర్రగుంట గ్రామం నుంచి టీడీపీ పార్టీలోకి భారీగా చేరారు. వీరందరికీ పార్టీ కండువా వేసి అమిలినేని టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రోజురోజుకు చేరికలు ఎక్కువైపోతుండటంతో పార్టీలో కొత్త జోష్ నిండిందన్నారు. ఆ ఉత్సాహంతోనే ఈ ఎన్నికల్లో 50 వేల వరకు మెజార్టీ రావడం ఖాయమన్నారు. ప్రతి గ్రామంలో టీడీపీ బలం పుంజుకుంటోందన్నారు. ఈ ప్రజాబలంతోనే విజయాన్ని సాధిస్తామన్నారు. వైసీపీపై ప్రజలందరూ విసుగుచెందే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతి గ్రామంలోనూ చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. భావితరాల భవిష్యత్తు, కుటుంబానికి ఆర్థిక భద్రత వుండాలన్నా ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా మనమందరం ఐక్యతతో టీడీపీని గెలిపించాలని కోరారు. మనందరి ధ్యేయం టీడీపీ గెలవాలి, చంద్రబాబు సీఎం కావాలని ముందుకు సాగాలన్నారు. అప్పుడే మన బలం ప్రజలకు తెలుస్తుందన్నారు. గ్రామ గ్రామాన టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. పార్టీకి వస్తున్న అపూర్వ ఆదరణతోనే కళ్యాణదుర్గంలో తిరుగులేని విజయం సాధిస్తామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న అమిలినేని

నేటి నామినేషన్‌కు తరలిరండి: కళ్యాణదుర్గం పట్టణంలో గురువారం నిర్వహించే నామినేషన్ కార్యక్రమానికి ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు నాయకులు భారీగా తరలిరావాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. బుధవారం ప్రజావేదిక వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ ప్రజాబలాన్ని నిరూపించాలన్నారు. టీడీపీకు కంచుకోటగా మారిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అశేషంగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కళ్యాణదుర్గంలో టీడీపీని గెలిపించడమే మొదటి కర్తవ్యంగా ముందుకు సాగాలన్నారు. అప్పుడే మన విజయం సునాయాసంగా మారుతుందన్నారు.

చంద్రబాబును సీఎంగా చేసుకుందాం - అమిలినేని యశ్వంత్



చంద్రబాబునాయుడును సీఎం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అమిలినేనిసురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రజావేదిక వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలురావాలంటే చంద్రబాబునాయుడే సీఎం కావాలన్నారు. భావితరాల భవిష్యత్తు బాగుపడాలన్నా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్క నిరుద్యోగ యువత చంద్రబాబు పాలనపై మొగ్గు చూపుతూ సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కార్యక్రమంలో పీనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: గుమ్మనూరు


గాజులపల్లిలో మాట్లడుతున్న గుమ్మనూరు జయరాం

గుత్తిరూరల్, ఏప్రిల్ 24: అధికారంలోకి రాగానే గ్రామాలన్నీ అభివృద్ధి చేస్తానని గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం మండలంలోని జక్కలచెరువు, గాజులపల్లి, ఇసురాళ్లపల్లిలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేస్తే రాష్ట్రం బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలుపించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బర్డివలి, కేసీ హరి చిన్నరెడ్డి యాదవ్, గుమ్మనూరు నారాయణ, హిమబిందు, సర్పంచ్ భరత్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, లక్ష్మీనారాయణమ్మ, రంగారెడ్డి యాదవ్, గోవర్ధన్ గౌడ్, సుధీర్ గౌడ్, వెంకటనారాయణ, రామాంజునేయులు, శివశంకర్, సాంబశివ, రవితేజ నారాయణస్వామి ఏంకే చౌదరి, ప్రతాప్, గోవిందు, లక్ష్మీరంగయ్య పాల్గొన్నారు.

జయరాంను గెలిపించండి

గుంతకల్లు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాంను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 29, 30 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు జయరాం, అంబికా లక్ష్మీనారాయణకు ఓట్లువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, ప్రధాన కార్యదర్శి గుజరీ మహమ్మద్ ఖాజా, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, అంజి, హనుమంతు, యాస్మిన్, ఫ్రూట్ మస్తాన్, ఆటో ఖాజా, కోడి సీన పాల్గొన్నారు.

నామినేషన్‌కే వలస తెచ్చుకోవాల్సిన దుస్థితి

పామిడి: గుంతకల్లు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్‌కే పక్క జిల్లాలోని ఆదోని, మంత్రాలయం, ఉరవకొండ నుంచి ప్రజలను వలస తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని గుమ్మనూరు నారాయణ ఎద్దేవా చేశారు. పట్టణంలోని 7, 8వ వార్డులలో బుధవారం టీడీపీ, జనసేన నాయకులుతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. జయరాంను ఆదరిస్తే అభివృద్ధి చేస్తామని గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. బుధవారం ఉదయాన్నే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్న వృద్ధులు, యువకులతో ఆయన చర్చించారు. బీసీసీ రోడ్డుపై ఉన్న ప్రజలతో మమేకమై ఆప్యాయంగా పలకరించారు. ఎన్డీయే కూటమిని ఆశీర్వదించాలని కోరారు.


యువతతో మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర్

బీసీలకు టీడీపీ పెద్దపీట


టీడీపీ జిల్లా అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుమ్మనూరు జయరాం

గుత్తి, ఏప్రిల్ 24: టీడీపీ అధినేత చంద్రబాబు బీసీలకు పెద్దపీట వేశారని గుంతకల్లు అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. గుత్తి పట్టణానికి చెందిన వెంకటశివుడు యాదవ్‌కు అనంతపురం పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమించడంతో బుధవారం రాత్రి ఆయన స్వగృహం వద్ద టీడీపీ శ్రేణులతో కోలాహలం నెలకొంది. జయరాం వెంటకశివుడు యాదవ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. వెంకటశివుడుయాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. కేసీ హరి, న్యాయవాది సోమశేఖర్, [illegible]ంద్ర, కేశవనాయుడు, ఎంకే చౌదరి, రవి, నారాయణస్వామి, తెలుగు యువత మండల నాయకుడు సుధాకర్‌యాదవ్, కమ్మసంఘం మండల అధ్యక్షుడు నాగరాజు, మల్లికార్జున, నరేంద్రచౌదరి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 24: పట్టణంలోని బస్టాండ్ వద్ద భజరంగి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని ప్రత్యేకంగా ఆళ్లగడ్డ నుంచి తీసుకొచ్చి మంగళవారం రోజు రాత్రి విశ్వక్సేన హోమం కలశ స్థాపన, జలాభిషేకం, శయనోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారి విగ్రహ స్థాపన, పంచామృతాభిషేకం, హోమం పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన చేశారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దేవిరెడ్డిపల్లి రాజేష్, సభ్యులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో ఉపాధ్యాయుడి కుచ్చుటోపీ

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 24: పట్టణంలో 23 ఏళ్లుగా ఎస్జీటీ టీచర్‌గా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు రూ.4కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే సదరు ఉపాధ్యాయుడు ఉద్యోగం వచ్చినప్పటి నుంచి మున్సిపాలిటీలోనే విధులు నిర్వహిస్తున్నాడు. ఎక్కువగా తోటి ఉపాధ్యాయులు, బంధువులు, మిత్రులు ఈయన మాయలో ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. తోటి ఉపాధ్యాయుల్లో కొందరిని ష్యూరిటీగా ఉపయోగించుకున్నట్లు తెలిసింది. బంధువుల్లో అయితే పెద్దమొత్తం అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. చాలా ఏళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తుండడం, పైగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో ప్రజలతోపాటు, తోటి ఉపాధ్యాయులు ఎక్కువగా చిట్టీలు కట్టారు. మొదట బాగానే లావాదేవీలు జరిపాడు. కానీ ఏం జరిగిందో ఏమో తెలియదు గానీ ఐదారునెలల నుంచి చిట్టీలు కట్టిన వారు డబ్బులు చెల్లించాలని అడిగితే వాయిదా వేస్తూ వచ్చాడు. మరీ ఒత్తిడిచేసిన వారికి ప్రామిసరినోట్లను రాసి ఇచ్చాడన్న వదంతులు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా చేసుకున్న ఉపాధ్యాయుడు నెలరోజుల నుంచి టోకరా వేయడానికి ప్రణాళిక రచించాడని భోగట్టా. 20రోజులు పాఠశాలకు సెలవుపెట్టాడు. సెలవుదినాల్లో తాను అనుకున్న ప్రణాళికను ఆచరణలోకి తెచ్చాడు. బ్యాంకుల్లో ఉన్న నగదుతోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లను విత్‌డ్రా చేశాడని ఆ అకౌంట్లను కూడా క్లోజ్ చేసుకున్నట్లు సమాచారం. చివరికి చిట్టీలు కట్టించుకున్నవారితో కూడా డబ్బులు కట్టించుకోవడానికి నేరుగా కాకుండా ఎలా కట్టించుకోవాలో బాగా ఆలోచించి మరో ఎత్తుగడ వేసి చిట్టీలు వేసుకున్న వారికి ఫోన్లు చేశాడు. తాను ఊరిలో లేనని పనిమీద ఊరికి వచ్చానని చిట్టీల డబ్బులను ఫోన్‌పే చేయాలని చెప్పాడని పలువురు ఫోన్‌పే కూడా చేసినట్లు తెలిసింది. కానీ నిబంధనల మేరకు పాఠశాల చివరిరోజు తప్పనిసరిగా విధులకు హాజరుకావాల్సి ఉంది. బుధవారం కూడా డుమ్మా కొట్టడంతో వారి అనుమానం మరింత బలపడింది. చిట్టీలు కట్టిన వారిలో టీచర్లతోపాటు ప్రజలు కూడా ఉండడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాల్సిందే

- కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి


ప్రచారంలో పాల్గొన్న అశ్మిత్‌రెడ్డి

యాడికి, ఏప్రిల్ 24: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోయరెడ్డిపల్లి, చింతలాయపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం కావాలంటే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. ప్రచారంలో మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, వేలూరు రంగయ్య, పరిమి చరణ్, బయపురెడ్డి, రామకృష్ణ, పెద్దయ్య, నాగేశ్వర, రవికుమార్‌రెడ్డి, తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ, నాగలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చిన్నపొలమడలో ప్రచారం

తాడిపత్రిటౌన్: మండలంలోని చిన్నపొలమడలో బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. నరేంద్రనాయుడు, ప్రసాద్, నాయుడు, రవి, కొండారెడ్డి, సుబ్బయ్య, నాగార్జున పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక: స్థానిక నివాసంలో బుధవారం పెద్దవడుగూరు మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ మద్దతుదారులు జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఓలయ్య, జయకృష్ణ, రవి, రాంమోహన్, రాము ఉన్నారు.

జేసీపీఆర్ పర్యటన: పట్టణంలోని విజయనగర్‌కాలనీలో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. మల్లికార్జునరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు, చింబిలి ప్రసాద్‌నాయుడు విజ్జి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న జేసీపీఆర్

దుర్గం పసుపుమయం


నామినేషన్‌కు తరలివెళుతున్న నాయకులు

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు నామినేషన్‌లో భాగంగా బుధవారం పట్టణం పసుపుమయంగా మారింది. మండలంలోని కెంచానపల్లి, వేపరాల, బీఎన్‌హళ్లి, ఉడేగోళం, మల్లాపురం, చదం గొల్లలదొడ్డి, మెచ్చిరి, గ్రామదట్ల తదితర గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలలో వేలాదిగా తరలివచ్చారు. మండల కన్వీనర్ కురుబ హనుమంతు, కాటా వెంకటేశులు, పోట్ల రవి, సిద్ధప్ప, సోమశేఖర్, వీరేష్, లచ్చణ్ణచౌదరి, గిరిధర్‌నాయుడు, సర్పంచులు వన్నూరుస్వామి, మల్లేశప్ప, రాజశేఖర్‌రెడ్డి, అశోక్, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ నామినేషన్‌లో యానిమేటర్


నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరుతున్న వైసీపీ నాయకులతో యానిమేటర్ (వృత్తంలో వ్యక్తి)

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య నామినేషన్ కార్యక్రమంలో కుందుర్పి మండలం కరిగానపల్లి గ్రామానికి చెందిన యానిమేటర్ కదరప్ప పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కార్యకర్తలను నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరమని సూచించడమే కాకుండా నాయకులు, కార్యకర్తలతో కలసి ఆ యానిమేటర్ దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అతనే వుండి నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలను, నాయకులను తరలించడంలో ప్రధానపాత్ర పోషించారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

గార్లదిన్నె, ఏప్రిల్ 24 : కూడేరు మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన గొర్రెల కాపరి కురుబ రాగే రాఘవేంద్ర (38) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పుడు కూడా అధికమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను మంగళవారం రాత్రి శింగనమల మండలం లోలూరు సమీపంలోని భారత్‌బెంజ్ షోం రూం వెనుకవైపు రైలు కింద ఆత్మహత్య చేసుకున్నాడు. రాఘవేంద్ర భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఎస్‌ఐ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పంటలు దగ్ధం

పెద్దపప్పూరు, ఏప్రిల్24: మండలంలోని వరదాయపల్లి గ్రామానికి చెందిన రైతులు నాగార్జున, వన్నప్పలకు చెందిన పంటలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతులు తెలిపిన మేరకు నాగార్జున నాలుగున్నర ఎకరాల్లో అరటిపంట సాగుచేశాడు. రైతు మాబు ఐదెకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. చిన్నవన్నప్ప రెండెకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా, పెద్దవన్నప్ప మూడెకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. చిన్నవన్నప్ప పొలంలోని ప్రధాన విద్యుత్‌లైన్లు రాపిడి కావడంతో నిప్పురవ్వలు మొక్కజొన్న పంటపై పడ్డాయి. దీంతో పంటమొత్తం వ్యాపించి కాలిపోయింది. ఎండతీవ్రతకు మంటలు వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న మొక్కజొన్న, అరటిపంటలకు తాకడంతో అవి కాలిబూడిదయ్యాయి. రూ.15లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. సమాచారం అందుకున్న అధికారులు పంటపొలాలను పరిశీలించారు.


15మంది బైండోవర్

యల్లనూరు, ఏప్రిల్ 24: మండలంలో బుధవారం 15 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. వెన్నపూసపల్లి, బొప్పేపల్లి, గడ్డంవారిపల్లి గ్రామాల్లో వివిధ కేసుల్లో ఉన్న వారిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీ చేశామన్నారు. అనంతరం వీరిని డిప్యూటీ తహసీల్దార్ శ్వేత వద్ద హాజరుపరిచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

విడపనకల్లు, ఏప్రిల్ 24: మండలంలోని కరకముక్కల-విడపనకల్లు గ్రామాల మధ్యనున్న ఉప్పు కొండ వద్ద రోడ్డుపై ఈదుర గాలులకు ముళ్ల పొదలు చేరాయి. నాలుగు రోజులు అయినా వాటిని ఎవరూ తొలగించలేదు. సోమవారం రాత్రి కరకముక్కల గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు వ్యక్తిగత పనిమీద విడపనకల్లు గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డుపై ఉన్న ముళ్ల పొదల్లోకి దూరి ద్విచక్రవాహనం బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. అటు వైపు వెళ్తూ ఉన్న కరకముక్కల గ్రాస్థులు గమనించి గణేష్‌ను వెంటనే ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

వైసీపీ ప్రచార వాహనం బోల్తా


బోల్తాపడిన ప్రచార వాహనం

పుట్లూరు, ఏప్రిల్ 24: మండలకేంద్రంలోని బీసీకాలనీ హెచ్చెల్సీ కాలువ వద్ద వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ప్రచార రథం బుధవారం సాయంత్రం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో వాహనంలో ఇద్దరు వ్యక్తులు ఉండడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. పుట్లూరు నుంచి బాలాపురం గ్రామానికి ప్రచారానికి వెళుతుండడంగా వేగాన్ని అదుపుచేసుకోలేక బోల్తాపడినట్లు స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్ మద్యం సేవించడంతోనే బోల్తా పడినట్లు సమాచారం.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

యాడికి, ఏప్రిల్ 24: ఓబుళాపురం వీఆర్‌ఏ పుల్లన్న (62) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం ఆరోగ్యం విషమించి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతదేహానికి ఆర్‌ఐ ఆనంద్‌బాబుఆచారి, పలువురు వీఆర్వోలు, వీఆర్‌ఏలు నివాళులు అర్పించారు.